



తప్పు చేసి... తిప్పుకుంటూ..

వంశపారంపర్యంగా సంక్రమించిన భూముల వివరాలనె రెవెన్యూ రికార్డుల్లో తప్పులు నమోదు చేశారు. నమోదులో మీరు చేసిన తప్పే మా మెడకు గుదిబండలా మారిందని, ఆ తప్పులను మీరే సరిదిద్దండి మహాప్రభో అంటూ బాధితులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా వారి గోడు ఆలకించే నాధుడే కరువయ్యారు. ఇంకా గత ప్రభుత్వం నాటి అలసత్వం వీడలేదో! లేక బాధితుల ముక్కుపిండి మరీ లంచాలు దండుకుందామనుకుంటున్నారో! కానీ, కింది స్థాయి సిబ్బంది బాధితులను నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూనే ఉన్నారు. అవగాహన, ఆర్థిక స్థోమత ఉన్నవారు రెవెన్యూ అధికారులను బాధ్యులను చేస్తూ కోర్టుకెళుతుంటే, ఆర్థిక స్తోమత అంతగాలేని పేద రైతులు మాత్రం అధికారులు, మంత్రులను ఆశ్రయిస్తున్నారు. నేరుగా సీఎంనే కలుస్తున్నవారూ ఉన్నారు.




అనారోగ్యంతో మంచంపట్టి తన భూమి సమస్య తీర్చితే వైద్యం చేయించుకుంటానంటూ ఆవేదన చెందుతున్న మజ్జుసాహెబ్

- కొందరు సిబ్బంది చేసిన నిర్వాకానికి రైతుల అవస్థలు
- రెవెన్యూ రికార్డుల ఎంట్రీల్లో తప్పులు కోకొల్లలు
- విసిగిపోయిన బాధితులు నేరుగా సీఎంకే ఫిర్యాదు
- అయినా అర్జీలు పక్కన పడేస్తున్న సిబ్బంది
- లబోదిబోమంటున్న బాధితులు

బాపట్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపద్బాంధవుడిలా కనిపించటంతో బాధితులంతా తమ గోడు ఆయనకు విన్నవించుకుంటున్నారు. రెవెన్యూ సిబ్బంది చేసిన పొరపాట్ల వల్ల తమ భూముల అమ్మకాలు సాధ్యంకాక అవస్థలు పడుతున్నామని, వాటిని సరిచేయించాలంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రినే ప్రాధేయపడుతున్నారు. ఆయన కూడా ఇటువంటి లోపాలను వెంటనే సరిచెయ్యాలంటూ బాధితుల వినతిపత్రాలను సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు పంపుతుంటే, కిందిస్థాయి సిబ్బందిలో ఇంకా వీడని నిర్లక్ష్యం, జాప్యం వంటివి బాధితుల కన్నీరు తుడవటంలేదు. సీఎంఓ నుంచి వచ్చినా వాటినీ పక్కన పడేస్తుండటం, లేదంటే కొర్రీల మీద కొర్రీలు వేసి, క్షణాల్లో అయిపోయే సమస్యను కూడా పరిష్కారం చేయకుండా బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుతుండటం బాధితులను వేదనకు గురిచేస్తున్న పరిస్థితి. ఒక బాధితుడయితే తమ దగ్గర ఏదో ఆశించి కావాలనే మీరు పంపిన ఫిర్యాదులను కూడా పక్కన పడేస్తున్నారని, మాకు న్యాయం జరగటంలేదంటూ తిరిగి సీఎంకే ఫిర్యాదు చేయటం సిబ్బంది పనితీరుకు నిదర్శనం.

రెవెన్యూ సిబ్బంది నిర్వాకం... రైతులకు అగమ్యగోచరం

కొన్ని దశాబ్దాలుగా ఒకరి పేరుపైనే ఉన్న భూములు, వంశపారంపర్యంగా వస్తున్న భూముల వివరాలు పెద్దగా మార్పులు జరిగే పరిస్థితి లేదు. కొత్తగా రెవెన్యూ శాఖ రికార్డుల్లో వారి పేర్లు, వివరాలు ఎక్కిస్తున్నా వాటిలోనూ మార్పులు ఉండవు. కానీ కేవలం రెవెన్యూ సిబ్బందిలో కొందరు పూర్తి నిర్లక్ష్యంతో చేసిన తప్పులు ఇప్పుడు రైతుల మెడకు చుట్టుకుంటున్నాయి. తమకు కష్టమొచ్చిందని భూమిని అమ్మి, వచ్చిన డబ్బుతో ఇబ్బందులు తీర్చుకుందామని ఆశపడితే అవీ నెరవేరటంలేదు. తమ భూమిని తాము అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే అక్కడ ఆ సర్వే నంబరే రికార్డుల్లో కనిపించటంలేదంటే!.. రైతుల పరిస్థితి వర్ణనాతీతమే. ఇటీవలి కాలంలో భూముల వివరాలు సరిచేయటం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో భాగంగా రైతుల భూముల వివరాలను రీ ఎంట్రీ చేయటం వంటివి చేశారు. అయితే ఇక్కడ భూమి స్థితిని, రైతు స్థితిని నమోదు చేయటానికి కొన్ని కాలంలు ఇచ్చారు. వాటిలో కాలం నంబర్ 6లో భూమి స్థితిని వివరించేలా ఆ భూమి పట్టానా! ప్రభుత్వ భూమా అనే వివరాలు ఇవ్వాల్సిఉంటే, అవేమీ కాకుండా కొత్తగా మాగాణి అని నమోదు చేశారు. కాలం నంబర్ 8 లోనూ వివరాలు తప్పగా నమోదు చేశారు. వీటివల్ల ఆ భూములు అమ్ముకోవాలంటే ఇబ్బందులు తప్పని పరిస్థితి. వీరు చేసిన చిన్న పొరపాటు కారణంగా సబ్ రిజిస్ట్రార్ లాగిన్‌లో ఆ భూముల వివరాలు కనిపించవు. ఆ సర్వే నంబర్ లాక్ అయిపోతుంది. దానిని అమ్మాలంటే సాధ్యం కాదు. దీంతో అప్పటి వరకు రికార్డుల ఎంట్రీల్లో జరిగిన తప్పుల విషయం తెలియని రైతులు తమకు వచ్చి ఆరోగ్య సమస్యలో, పిల్లల వివాహ కార్యక్రమానికో ఉపయోగపడుతుందనుకున్న భూమిని అమ్మబోతే విస్తుకలిగించే విషయాలు వారిని మరింత అవస్థలకు గురిచేస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని తెనాలి, గుంటూరు, పొన్నూరు, మంగళగిరి, ముఖ్యంగా రాజదాని ప్రాంతమైన ఆయా గ్రామాల్లో ఈ ఇబ్బందులు చెప్పలేనన్ని ఉన్నాయి. అటు బాపట్ల, పల్నాడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఇతర లోపాలున్నా, ఈ పొరపాట్లు మాత్రం లేవు. బాపట్ల జిల్లాలో ప్రధానంగా లంక గ్రామాల్లో రైతులకు అవస్థలు తప్పటంలేదు. అయితే ఇటువంటి వాటిని మళ్లీ సరిచెయ్యాలంటే కేవలం ఆ జిల్లా జాయింట్ కలెక్టర్ లాగిన్‌లోనే అన్‌లాక్ చెయ్యాల్సి ఉంటుంది. అట్లా చెయ్యాలంటే తహసీల్దార్ కార్యాలయం నుంచి, ఆర్డీఓ, సబ్‌కలెక్టర్ కార్యాలయాల సిబ్బంది భూమి వివరాలు, రైతుల పరిస్థితిని విచారించి రిపోర్టు పంపాల్సి ఉంటుంది. అయితే చిక్కంతా ఇక్కడే వస్తోంది. భూమి ఉన్న రైతుకు దీనిలో ఎటువంటి సంబంధంలేకున్నా, తప్పు జరగటానికి బాధ్యులు రెవెన్యూ సిబ్బందే అయినా, దానికీ రైతులే మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితి. వారి అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు రెవెన్యూ సిబ్బంది వెనకాడటంలేదంటే అతిశయోక్తి కాదు.



బాధితుడు ముఖ్యమంత్రికి పెట్టుకున్న అర్జీ

ముఖ్యమంత్రి తాపత్రయపడుతున్నా...

ప్రజా సమస్యలను పేరబెట్టకుండా వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌లు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు తీసుకుని పరిష్కరించేందుకు తాపత్రయపడుతున్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి వాటిపై సమీక్షిస్తున్నా, కొందరు కింది స్థాయి సిబ్బంది ఇంకా గత ప్రభుత్వ కాలంలో చూపిన నిర్లక్ష్యం ఇంకా చూపుతూనే ఉన్నారు. దీంతో బాధితుల సమస్యలు పరిష్కారం కాకపోగా, రాష్ట్రం మొత్తం వ్యవహారాలను చూడాల్సిన ముఖ్యమంత్రి సమయం కూడా వృధా అవుతోంది. ముఖ్యమంత్రి కష్టపడుతున్నా, కిందిస్థాయి సిబ్బంది మాత్రం తమ నిర్లక్ష్యాన్ని వీడటంలేదు. దీంతో బాధితులు మళ్లీమళ్లీ సీఎంఓను ఆశ్రయించాల్సిన పరిస్థితి. తెనాలికి చెందిన మజ్జు సాహెబ్‌కు వ్యవసాయ భూమి ఉంది. అతను అనారోగ్య సమస్యతో ఆసుపత్రి అవసరాలకోసం భూమిని అమ్మేద్దామని ప్రయత్నిస్తే, రిజిస్ట్రేషన్ సమయంలో అధికారులు అసలు మీ భూమికి సంబంధించి సర్వే నంబరే మా రికార్డుల్లో కనిపించటంలేదని పిడుగులాంటి వార్త చెప్పటంతో ఆ కుటుంబం భయంతో తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు పెట్టింది. జూన్‌లో అధికారులు పొరపాటు తమ దగ్గరే జరిగిందని, దానిని సరిచేస్తామంటూ కొలతలు కొలిచి, నివేదికను సబ్‌కలెక్టర్ కార్యాలయం ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపారు. నెలల తరబడి వారు కలెక్టర్ కార్యాలయానికి, సబ్ కలెక్టర్ కార్యాలయానికీ తిరుగుతూనే ఉన్నారు. కానీ ఒక్క మార్పు కూడా జరగకపోవటంతో చేసేదిలేక చివరకు గత నెలలో అతని భార్య షేక్ ఖాజాబీ నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలసింది. తమ గోడు వివరించి, ఫిర్యాదును అందించింది. ఇదే తరహాలో ఒక్క తెనాలి మండలంలోనే 5,800 మంది రైతుల సర్వే నంబర్‌లు లోపాలతో ఉన్నాయనేది సమాచారం. అటు మంగళగిరి, బాపట్ల జిల్లాలోని బాపట్ల, రేపల్లె సబ్ డివిజన్‌ల పరిధిలో భారీగానే తప్పుల తడకలున్నాయనేది బాధిత రైతులు పెడుతున్న ఫిర్యాదులే వెల్లడిస్తున్నాయి. సోమవారం తెనాలిలో జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. దీనిలోనూ ఇటువంటి సమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు రావటం విశేషం. ఖాజాబీ కూడా తమ సమస్యపై కలెక్టర్‌కు వివరిస్తే, కింది స్థాయి సిబ్బంది మాత్రం దానిలో ఆర్ఎస్ఆర్ లేదని, ఎఫ్ఎంబీ కావాలని చెప్పటంతో బాధితురాలు అన్నీ దరఖాస్తుతోపాటే పెట్టామని చెప్పి, తన దరఖాస్తు చూపాలని అడిగితే వెతకాలని, తర్వాత రమ్మని నిర్లక్ష్యంగా చెప్పటం కొసమెరుపు. ఈ మజ్జుసాహెబ్ భూమికి సంబంధించే తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయ ఉద్యోగి, కలెక్టరేట్‌లోని డీ సెక్షన్ అధికారిపై పేర్లు ప్రస్తావించి మరీ సీఎంకు బాధితులు ఫిర్యాదు చేయటం విశేషం. వీరు కావాలనే ఉద్దేశపూర్వకంగా తమను ఇబ్బందిపెడుతున్నారనేది వారి ఫిర్యాదు సారాంశం. అయితే సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడితేనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.



డీలర్లు డీలా!

- రేషన్ షాపుల రేషనలైజేషన్‌తో చిక్కుల్లో డీలర్లు
- వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన పౌర సరఫరా వ్యవస్థ
- సరఫరా లేక, కమీషన్లు రాక అగచాట్లు పడుతున్న డీలర్లు
- కార్డుల సంఖ్య తగ్గిస్తే మరింత కష్టమంటున్న డీలర్లు
- కమీషన్లు పెంచాలని ప్రభుత్వానికి వేడుకోళ్లు
- ఎండీయూ వాహనాలపై రూ.30వేలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- అందులో సగం తమకు ఇచ్చినా చాలంటున్న వైనం

రేపల్లె, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంతో పౌర సరఫరాల వ్యవస్థ నిర్వీర్యమై ఆదాయాలు పడిపోయి అగచాట్ల పాలైన రేషన్ డీలర్లు, కూటమి ప్రభుత్వ నిర్ణయంతో మరింత డీలా పడిపోయారు. రేషన్ షాపులకు రేషన్ కార్డులను కుదిస్తూ చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియ వారికి మరింత శరాఘాతంగా మారింది. గత ప్రభుత్వ నిర్వాకంతో నామమాత్రంగా మారిన రేషన్ సరఫరా వ్యవస్థ, ప్రభుత్వ నిర్ణయంతో పూర్తిగా మనుగడ కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. గత ఐదేళ్లలో బియ్యం తప్ప మరే ఇతర సరుకులు సరఫరా చేసేందుకు అవకాశం లేకపోవడంతో కమీషన్లు తగ్గి అల్లాడుతున్న రేషన్ డీలర్లకు ఇప్పుడు రేషన్ కార్డులు కూడా తగ్గితే ఆదాయం మరింత పడిపోతుందని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో డీలర్లుగా కొనసాగాలా వద్దా.. అనే మీమాంసలో వున్నారు. ఫలితంగా రేషన్ వ్యవస్థ మనుగడపైనే అది ప్రభావం చూపుతోంది.

● రేషనలైజేషన్ చిచ్చు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 17లక్షల రేషన్ కార్డులు వున్నాయి. గుంటూరుజిల్లాలోని 5,99,511 మంది కార్డు దారులకు రేషన్ సరఫరా చేసేందుకు 972 రేషన్ షాపులు వున్నాయి. బాపట్ల జిల్లాలో 4, 75,744 మంది కార్డు దారులు వుండగా వారికి రేషన్ సరఫరా చేయడానికి 1,123 రేషన్ షాపులు, పల్నాడు జిల్లాలో 6,46,068 మంది కార్డుదారులు వుండగా వారికోసం 1,290 రేషన్ షాపులు వున్నాయి. వీటిని కూటమి ప్రభుత్వం రేషనలైజ్ చేయాలని నిర్ణయించింది. ఒక్కో రేషన్ షాపుకు గ్రామాల్లో 400 నుంచి 450 కార్డులు, పట్టణాల్లో 500 నుంచి 550 రేషన్ కార్డులు, నగరాల్లో అయితే 600 నుంచి 650 రేషన్ షాపులు వుండేలాగా ఈ రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతోపాటు పెరిగిన జనాభాకు అనుగుణంగా మరికొన్ని రేషన్ షాపులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం కారణంగా తమ ఆదాయాలు మరింత పడిపోతాయని డీలర్లు ఆవేదన చెందుతున్నారు.

● తగ్గిన కమీషన్.. పడిపోయిన ఆదాయం

రేషన్ సరుకులు ప్రతి నెలా సరఫరా చేసినందుకు డీలర్లకు కిలోకు ఒక రూపాయి కమీషన్ ఇస్తున్నారు. ఒక్కో రేషన్ షాపులో సగటున 6 నుంచి 10 టన్నుల బియ్యం సరఫరా అవుతుంది. 400 కార్డులుండే షాపులో 6, 7 టన్నుల రేషన్ బియ్యం ప్రతి నెలా సరఫరా అవగా, 600కు పైగా కార్డులున్న షాపుల్లో 10 టన్నుల రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. వీటి ద్వారా కిలోకి రూపాయి చొప్పున 6 టన్నులైతే రూ.6వేలు, 10 టన్నులైతే రూ.10వేలు ఒక డీలర్‌కు ఆదాయం వస్తోం ది. దానితోపాటు అరకిలో పంచదార వస్తోంది. అంటే 400 కార్డులకు రూ. 2 క్వింటాళ్లు సరఫరా చేస్తారు. తద్వారా రూ.200 కమీషన్ వస్తుంది. 600 కార్డులకు 3 క్వింటాళ్లు సరఫరా చేస్తారు. తద్వారా మరో రూ.300 కమీషన్ వస్తుంది. అంటే ఒక్కో షాపుకు సగటున రూ.6,200 నుంచి 10,300కు మించి ఆదాయం రావడంలేదు. గతంలో కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, కిలో గోధుమపిండి, కిలో రాగి పిండి సరఫరా చేసేవారు. తద్వారా ఒక్కో కార్డుకు మరో 4 రూపాయలు ఆదాయం వచ్చేది. గడిచిన ఐదేళ్లుగా ఆ ఆదాయం తగ్గిపోయింది. ప్రస్తుత రేషనలైజేషన్ నిర్ణయంతో అది మరింత పడిపోతోంది. అయితే పట్టణాల్లో షాపు అద్దెలు రూ.3 నుంచి 5వేల వరకూ వుండగా, గ్రామాల్లో రూ.1500 నుంచి 2వేల వరకూ వుంటోంది. తమకు వచ్చే కమీషన్లలో సగం అద్దెలు, నిర్వహణకే పోతోందని వాపోతున్నారు.

● కమీషన్ పెంచాలని డిమాండ్..

పౌర సరఫరాల వ్యవస్థలో ప్రక్షాళన మొదలు పెట్టిన ప్రభుత్వం తమ గోడు కూడా పట్టించుకోవాలని డీలర్లు వేడుకొంటున్నారు. తమకు వచ్చే ఆదాయం అంతంత మాత్రంగా వుంటుంటే ఇప్పుడు కార్డులు తగ్గిస్తే తాము ఘోరంగా నష్టపోతామంటున్నారు. ప్రస్తుతం తమకు కిలోకు రూపాయి లెక్కన ఇస్తున్న కమీషన్ తమకు ఏమాత్రం సరిపోవడం లేదని వారు చెబుతున్నారు. దాన్ని కిలోకు 3 రూపాయలకు పెంచాలని కోరుతున్నారు. అదేమీ ప్రభుత్వంపై భారం కాదని, ఇప్పటికే ప్రభుత్వం ఒక్కో ఎండీయూ వాహనంపై నెలకు రూ. 30వేలకు పైగా ఖర్చు చేస్తోందని, ఆ ఖర్చును తగ్గించుకుని, డీలర్లకు కమీషన్ పెంచితే తమకు కమీషన్ పెరగడంతోపాటు, రేషన్ వ్యవస్థ గాడిలో పడుతుందని వారు చెబుతున్నారు.

టీడీపీలో క్లబ్‌ల చిచ్చు..

- గుంటూరులోని క్లబ్‌లపై మాత్రమే ఉక్కుపాదం..
- ఇదే జిల్లా పరిధిలో ఉన్న విజయవాడ క్లబ్‌కు మాత్రం మినహాయింపు

గుంటూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో పేకాట క్లబ్‌ల రగడ తెలుగుదేశం పార్టీలో చిచ్చు రగిల్చింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదు పేరొందిన క్లబ్‌లు ఉన్నాయి. అందులో పెద్దల క్లబ్‌గా పేరొందిన ఎల్‌వీఆర్ క్లబ్ ఎంతో ప్రధానమైంది. అలాగే గుంటూరు, కృష్ణా జిల్లాల్లో పేరొందిన విజయవాడ క్లబ్ కూడా గుంటూరు జిల్లాలోని తాడేపల్లిలో ఉంది. ఈ క్లబ్ మంగళగిరి నియోజకవర్గం పరిధిలో ఉంటుంది. ఎల్‌వీఆర్ క్లబ్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉంది. అదే విధంగా గుంటూరు శివారు పలకలూరు రోడ్డులో గుంటూరు క్లబ్ ఉంది. ఈ క్లబ్ ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఇవన్నీ మెంబర్ షిప్ క్లబ్‌లు. అలాగే నార్త్‌క్లబ్ కూడా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో, చిలకలూరుపేట నియోజకవర్గ పరిధిలో సీఆర్ క్లబ్ ఉంది. కాగా ఈక్లబ్‌లన్నీ, 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ అంతకముందు కాంగ్రెస్ హయాంలోనూ ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాయి. టీడీపీ, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు ఈ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించేవారు. అయితే అప్పుడప్పుడు ఒకరిద్దరు ముక్కుసూటిగా వ్యవహరించే ఐపీఎస్‌లు ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎస్పీలుగా వచ్చినప్పుడు మాత్రం కొంత కాలం మూసివేయించే ప్రయత్నం చేసేవారు. ఆ సమయంలో కూడా ఎల్‌వీఆర్ క్లబ్ పాలకవర్గం కోర్టును ఆశ్రయించి కేవలం క్లబ్ సభ్యులు మాత్రమే ఆడుకుంటామని చెప్పి అనుమతులు పొందడం జరిగింది. అయితే వైసీపీ అధికారంలోకి రావడంతో కక్ష కట్టి ఈ క్లబ్‌లన్నింటినీ మూసివేయించారు. ఈ ఐదేళ్లు క్లబ్‌లు మూతపడడంతో జూదరులు బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్లి ఆడుకోవడం జరిగింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఒకొక్కొటిగా తిరిగి తెర్చుకున్నాయి. క్లబ్‌లు మూతపడడం మూలంగా వాటిపై ఆధారపడి జీవించే ఉద్యోగులు, కార్మికులు ఇప్పటి వరకు రోడ్డున పడిన వారికి తిరిగి జీవనోపాధి దొరుకుతుందని అధికార పార్టీ నేతలు కూడా ఇప్పటి వరకు చూసీ చూడనట్టుగా వ్యవహరించారు. పేకాట ఆడుకునే వారిని కట్టడి చేయడం సాధ్యంకాదని వేరే నగరాలకు వెళ్లైనా ఆడుకుంటారనే భావన అధికార పార్టీ సీనియర్ నేతల్లో ఉంది. కాగా క్లబ్‌లు తెరుచుకున్న మొదటి నెలలోనే క్లబ్‌ల విషయంలో టీడీపీలో చిచ్చు రగిలింది. మొదటగా ఎల్‌వీఆర్, గుంటూరు క్లబ్‌లు తెరుచుకోగా ఆ తరువాత పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని నార్త్ క్లబ్ కూడా తెరిచారు. అయితే అది సభ్యత్వాలతో ప్రమేయంలేని క్లబ్ కావటం, పైగా ఆ క్లబ్ నిర్వహించే వారు ఎమ్మెల్యే మాధవి భర్త రామచంద్రరావు అనుచరులు కావడంతో వివాదం రేకెత్తి వార్తల్లోకెక్కటం జరిగింది. దీంతో ఎమ్మెల్యే మాధవి జోక్యం చేసుకొని ఆ క్లబ్‌ను మూసివేయించారు. అయితే ఈ క్లబ్‌ల వ్యవహారంలో తమపై తదుపరి విమర్శలు రాకూడదనే భావనతో ఎమ్మెల్యే మాధవి, తన నియోజకవర్గ పరిధిలో ఉన్న మరో క్లబ్ అయిన ఎల్‌వీఆర్‌ను కూడా మూసివేయించమని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. అయితే ఎల్‌వీఆర్ క్లబ్ పెద్దల క్లబ్‌గా పేరొందటంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించే పలు పోటీలు నిర్వహించటం ద్వారా పేరుండటంతో ముందుడగు వేయలేకపోయారు. ఇదే నేపథ్యంలో తన నియోజకవర్గం పరిధిలో ఉన్న గుంటూరు క్లబ్‌ను కూడా మూసివేయించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. అయితే ఆ క్లబ్ జోలికి కూడా వెళ్ళేందుకు పోలీసులు వెనుకాడారు. ఇదిలా ఉండగా ఇటీవల వరద బాధితులకు సహాయం అందించేందుకు ఎల్‌వీఆర్ క్లబ్ నిర్వాహకులు రూ. 25 లక్షలు, గుంటూరు క్లబ్ నిర్వాహకులు రూ. 10 లక్షలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబును కలిసి చెక్కులు అందజేశారు. అయితే ఈ చెక్కులు అందజేసేందుకు పాలకవర్గం వారితో పాటు టీడీపీకి చెందిన ఓ సీనియర్ నేత కూడా ఉండటం స్థానిక ఎమ్మెల్యేలకే కాకుండా పార్టీకి చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలకు కూడా కంటగింపుగా మారింది. చెక్కులు ఇచ్చే సమయంలో తమను కూడా పిలిస్తే వెళ్ళే వాళ్ళం కదా అనే అక్కసును అనుయాయులు వద్ద వ్యక్త పరిచారని సమాచారం. ఈ నేపథ్యంలో అనుకోకుండా హోం మంత్రి ఇలాకాలో ఓ క్లబ్ వ్యవహారం రచ్చకెక్కడంతో, ఒక దశలో రాష్ట్రంలోని అన్ని క్లబ్‌లు మూయించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అయితే నిబంధనలకు అనుగుణంగా నడుచుకునే క్లబ్‌లకు మినహాయింపు ఇవ్వాలనే నిర్ణయం పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌వీఆర్ క్లబ్, గుంటూరు క్లబ్, చిలకలూరిపేటలోని సీఆర్ క్లబ్‌లను స్థానిక పోలీసులు మూసివేయించారు. రాష్ట్ర వ్యాప్తంగా మూతపడితే ఈ క్లబ్‌ల నిర్వహణ వెనుక ఉన్న టీడీపీ పెద్దలకు వేరే ఆలోచన వచ్చేది కాదు. అయితే ఈ మూడు క్లబ్‌లపైనే పోలీసులు ఉక్కుపాదం మోపటంపై అధికార పార్టీలో చిచ్చు రగిలింది. దీనికి తోడు ఇదే జిల్లా పరిధిలో ఉన్న విజయవాడ క్లబ్ మాత్రం కొనసాగుతుండటంతో పుండుపై కారం చల్లినట్టయింది. అయితే విజయవాడ క్లబ్ పాలకవర్గం మాత్రం పేకాట ఆడుకునేందుకు కేవలం సభ్యులకు మాత్రమే అనుమతి అంటూ గేటు ముంగిట నోటీసు బోర్డు పెట్టారు. కాగా తమ క్లబ్‌లు మూతపడటంలో కీలకమైన హస్తం ఎవరిదో అని తెలుసుకునేందుకు నిర్వాహకులు ఆరా తీస్తున్నారు.



మద్యం షాపుల కోసం 495 దరఖాస్తులు

- 12 షాపులకు స్పందన నిల్
- రేపటితో ముగియనున్న గడువు

బాపట్ల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో మద్యం షాపుల లైసెన్సులను దక్కించుకోవడానికి సోమవారం సాయంత్రం వరకు 495 మంది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి మద్యం షాపుల కోసం దరఖాస్తుల స్వీకరణను ఎక్సైజ్‌శాఖ ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి నాలుగు రోజులు వచ్చిన దరఖాస్తుల సంఖ్య 55కు మించలేదు. ఆది, సోమవారాల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రావడంతో మొత్తం సంఖ్య 495కు చేరింది. జిల్లాలో మొత్తం 117 షాపులను ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసిన సంగతి విదితమే. ఇందులో 12 షాపులకు సోమవారం వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని సమాచారం. దరఖాస్తుల సమర్పణకు రేపటితో గడువు ముగుస్తుండడంతో ఆశావహుల సంఖ్య 800 వరకు చేరే అవకాశం ఉంటుందని యంత్రాంగం అంచనా వేస్తోంది.

గవర్నర్‌కు.. ఘనస్వాగతం

బాపట్ల, అక్టో బరు 07 : గవర్న ర్ అబ్దుల్ నజీర్ సో మవారం బాపట్ల మం డలం పాండురంగాపురం గ్రామ సముద్రతీరంలోని గో ల్డెన్ రిసార్ట్స్‌లో బస చేశారు. ఆయనను కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి, అభినందనలు తెలియజేశారు. వ్యక్తిగత పర్యటనలో భాగం గా బాపట్ల వచ్చిన గవర్నర్‌కు జిల్లా పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మురళి, ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

పాహిమాం.. పరాశక్తి

జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఐదో రోజున సోమవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. పలు దేవాలయాల్లో అమ్మవారు వివిధ అలంకారాలలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. - బాపట్ల



రేపల్లె: చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో కాళికాదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి



బాపట్ల: శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ మహాచండీదేవిగా అమ్మవారు

ధ్వజస్తంభం, ఇత్తడి తొడుగులూ అమ్ముకొన్నారు

▸ వైసీపీ నేతల అరాచకంపై టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో వైసీపీ నేతలు గుడి ధ్వజస్తంభం, ఇత్తడి తొడుగులు అమ్ముకొన్నారని సూలం రమేశ్ అనే వ్యక్తి సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 'నర్సరావుపేట స్టేషన్ రోడ్డులో ప్రసన్నాంజనేయ స్వామి గుడిలో ఏర్పాటు చేయడానికి ధ్వజస్తంభం, దానికి ఇత్తడి తొడుగులు, ఇత్తడి సామాను తెచ్చాం. వైసీపీ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు బొగ్గరం మూర్తి, నరసింహకుమార్ వాటిని అమ్ముకొన్నారు. ఈ గుడి పునర్నిర్మాణానికి నేను నిధులు ఖర్చు చేశాను. శిలా ఫలకంపై నా పేరు వేయిస్తే దానిని పగలగొట్టారు. నన్ను గుడిలోకి వెళ్లకుండా అడ్డుకుని, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు. గుడి సొత్తును కొట్టేసిన వారిపై చర్య తీసుకోవాలి. నాపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయించాలి' అని రమేశ్ విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ ఎన్నికల సమయంలో తనను కొట్టి నామినేషన్ వేయకుండా అడ్డుకొన్న వైసీపీ నేతలపై చర్య తీసుకోవాలని రాయచోటికి చెందిన కే అబ్దుల్ రెహమాన్ కోరారు. బిల్డర్ శ్రీహరి... 'రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ బాండ్లను నిలిపివేయడం వల్ల భవన నిర్మాణంలో వాటిని వాడుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీనివల్ల నిర్మాణ పనులు కుంటుపడుతున్నాయి. సమస్యను పరిష్కరించండి' అని విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో 347 మంది దినసరి వేతనంపై పనిచేస్తున్నారు. వారిని అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలని గత ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆ ఉతర్వులు అమలు కాకపోవడంతో తమకు ఐదు నెలల నుంచి జీతాలు అందడం లేదు' అని కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. రాయచోటిలో ఇందిరమ్మ ఇళ్ల మధ్య స్కూల్, ఆట స్థలం కోసం వదిలిన స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించారని, దానిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని అబ్దుల్ రహీమ్ కోరారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో మాజీ వలంటీర్ షేక్ యాసిన్ అక్రమాలపై స్థానికులు ఫిర్యాదు చేశారు.

వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా సురేష్‌కుమార్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా గేదెల సురేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సురేష్ కుమార్ ఇండియన్ ఇన్‌ఫర్మేషన్(ఐఐఎస్) 2011 బ్యాచ్ అధికారి. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఇప్పటి వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన ఏపీ సీడ్స్ ఎండీ శివప్రసాద్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది.

ఇమామ్‌లు, మౌజన్‌లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలి

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని మసీదుల ఇమామ్, మౌజన్‌లందరికీ గౌరవ వేతనం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు జాతీయ మైనార్టీస్ కమిషన్ రాష్ట్ర మాజీ సలహారు అర్షద్ అయూబ్ ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల మసీదుల ఇమామ్‌లకు రూ.పదివేలు, మౌజన్లకు రూ.ఐదు వేల గౌరవ వేతనం అందిస్తోందని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న 1423 గౌరవ వేతన దరఖాస్తులను కూడా సత్వరమే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

ఉత్తరాంధ్ర-ఒడిశా కొత్త రైల్వే లైన్ నిర్మించండి

▸ అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, ఒడిశా రాష్ట్రాన్ని కలుపుతూ నూతన రైల్వే లైన్‌ను నిర్మించాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు సమక్షంలో రైల్వే మంత్రికి ఎంపీ కలిశెట్టి వినతిపత్రం అందజేశారు. చీపురుపల్లి- రాజాం- పాలకొండ-సీతంపేట-కొత్తూరు-పర్లాకిమిడి-మెలియాపుట్టి-పలాసను కలుపుతూ రైల్వే లైన్‌ను నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎంపీ కలిశెట్టిని కేంద్ర మంత్రి వైష్ణవ్‌కు పరిచయం చేస్తూ 'వెరీ యాక్టివ్ ఎంపీ' అని ప్రశంసించారు. కాగా ఈ నెల 13న ప్రారంభమయ్యే పైడితల్లి సిరిమాను మహోత్సవాలకు రావాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఎంపీ కలిశెట్టి ఆహ్వానించారు.

చైనా గూఢచారి బెలూన్లను కూల్చే సత్తా భారత్‌కు!

న్యూఢిల్లీ, అక్టోబరు 7: ఇతర దేశాలపై నిఘాకి చైనా వినియోగిస్తున్న గూఢచారి బెలూన్లను కూల్చడంపై భారత వాయుసేన శిక్షణ పొందినట్లు సమాచారం. తాజాగా తూర్పు ఎయిర్ కమాండ్‌లో 55వేలకుపైగా ఎత్తులో ఎగురుతున్న చైనా తరహా గూఢచారి బెలూన్‌ను రఫేల్ జెట్‌ను ఉపయోగించి కూల్చివేశారు.

కౌలుదార్లకు మేలు చేసేలా కొత్త చట్టం

▸ కౌలు రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటాం

▸ గుంటూరు ప్రాంతీయ సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు



టమోటా, ఉల్లి ధరల అదుపుపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కౌలు రైతులకు మంచి చేసేలా సరికొత్త చట్టం తీసుకురాబోతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నూతన చట్టంలో భూయజమానికి ఎలాంటి అనుమానాలకు తావులేకుండా కౌలుదారుకు లబ్ధి జరిగేలా చూస్తామన్నారు. కౌలు రైతులు కార్డులు తీసుకొని వెళ్లగానే ప్రాథమిక పరపతి సంఘాల్లో సభ్యత్వం, సొసైటీల ద్వారా రుణాలు వంటివి వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం ఏపీలో 2024 కౌలురైతు చట్టాన్ని శాసనం చేసేందుకు తొలి ప్రాంతీయ సదస్సు జరిగింది. గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి కౌలురైతులు, రైతు సంఘాల నాయకులు హాజరయ్యారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ కొత్త చట్టంలోని అంశాలను రైతులకు వివరించారు. అనంతరం కౌలు రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రైతుకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 85-90 శాతం వ్యవసాయం కౌలుదారుల ద్వారానే జరుగుతున్నదని తెలిపారు. ప్రకృతి విపత్తులతో జరుగుతున్న నష్టం వర్ణనాతీతమని, అలాంటి వారికి సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కొత్త చట్టం ప్రతిపాదనలను ఇప్పటికే కేబినెట్ ముందుకు తీసుకొచ్చామని తెలిపారు. అందరినీ భాగస్వామ్యం చేసి, అందరి సలహాలతో చట్టాన్ని పకడ్బందీగా రూపొందిస్తామని మంత్రి పేర్కొన్నారు. కౌలురైతుల చట్టం మొదటగా 1956లో వచ్చిందని, ఆ తర్వాత 2011లో వచ్చిందని తెలిపారు. అయితే అది పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వం కొంత మేర అమలు చేయడంతో కౌలుదారులు సంతోషించారని అన్నారు. 2019లో వేరొక చట్టం చేసిన వైసీపీ ప్రభుత్వం.. మళ్లీ సమస్యను మొదటికి తీసుకొచ్చిందని విమర్శించారు. రైతు సంతకం పెడితే తప్ప కౌలురైతుకు సాయం అందని పరిస్థితి సృష్టించారని, జగన్ సర్కార్ కౌలు రైతులకు అన్యాయం చేసిందన్నారు. తాను వ్యవసాయ మంత్రి అయ్యాక కౌలు రైతులకు న్యాయం జరగాలని, వారు జీవితాంతం గుర్తు పెట్టుకొనే చట్టం రూపొందించాలని స్పెషల్ సీఎస్‌కు చెప్పిన వెంటనే ఆయన కసరత్తు చేసి చట్టం రూపొందించారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలనేదే ఈ చట్టం లక్ష్యమన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు బజార్లలో కిలో టమాటా రూ.50

▸ నేటి నుంచే: మంత్రి అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి రైతు బజార్లలో టమాటా కిలో రూ.50 చొప్పున విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో సోమవారం సచివాలయంలో టమాటా, ఉల్లి ధరలపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ధరల నియంత్రణలో భాగంగా రైతుల నుంచి నేరుగా ఉల్లి, టమాటా సేకరించి, రైతుబజార్లలో సాధారణ ధరలకు విక్రయించాలన్నారు. కూరగాయల ధరల పట్టికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

మార్కెటింగ్ శాఖే కారణమా?!

రిటైల్ మార్కెట్‌లో టమాటా ధర పెరుగుదలకు పరోక్షంగా మార్కెటింగ్‌శాఖే కారణమన్న విమర్శలొచ్చాయి. అనంతపురం పులివెందుల మార్కెట్లలో అధికారులు టమాటా కిలో రూ.65-75 చొప్పున కొనుగోలు చేసి, ఇతర జిల్లాలకు పంపడంతో రిటైల్ మార్కెట్‌లో ధర పెరిగాయన్న వాదన వస్తోంది. అటు రైతుకు గిట్టుబాటు ధర ఇప్పించడానికి మార్కెట్‌లో జోక్యం చేసుకోవాల్సిన మార్కెటింగ్‌శాఖ ఇటు వినియోగదారులనూ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. కిలో రూ.50కి మించకుండా అందించాల్సి ఉంది.

మాల్దీవుల పర్యటనకు రండి!

▸ భారతీయులకు ముయిజ్జు విజ్ఞప్తి

▸ మోదీతో ద్వైపాక్షిక చర్చలు



న్యూఢిల్లీ, అక్టోబరు 7: తమ దేశంలో పర్యటనకు రావాలని మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలు, భారత్‌తో విభేదాలతో తమ పర్యాటక ఆదాయం పడిపోయిన నేపథ్యంలో ఆయన ఈ పిలుపునిచ్చారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు వచ్చేసిన ముయిజ్జు, సాజిదా దంపతులు సోమవారం రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అంతకుముందు వారికి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఘనస్వాగతం పలికారు. తర్వాత ప్రధాని మోదీతో ముయిజ్జు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాలూ పలు ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం మోదీతో సంయుక్త విలేకరుల సమావేశంలో ముయిజ్జు మాట్లాడుతూ ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న విదేశీ మారక సమస్యలను అధిగమించేందుకు భారత్ అందిస్తున్న సహాయసహకారాలు చాలా కీలకంగా మారనున్నాయంటూ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆపన్న హస్తం అందించడంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందని మోదీ స్పష్టం చేశారు. విదేశాంగ విధానంలో పొరుగువారికే తొలి ప్రాధాన్యం ఇస్తామని నొక్కి చెప్పారు. మాల్దీవులను 'సన్నిహిత మిత్రుడి'గా అభివర్ణించారు. ఆ దేశానికి అత్యవసర పరిస్థితుల్లోనూ, కొవిడ్ వ్యాక్సిన్ సరఫరా విషయంలోనే ముందుగా స్పందించినది భారతదేశమేనని గుర్తుచేశారు. భారత సాయంతో మాల్దీవుల్లో చేపట్టిన హనిమదూ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నూతన రన్‌వేను ఇరువురు నేతలు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతోపాటు మాల్దీవుల్లో రూపేకార్డు ద్వారా చెల్లింపులు జరిపే ప్రక్రియనూ ప్రారంభించారు. తద్వారా భారత పర్యాటకులు మాల్దీవులలో నగదు రహిత చెల్లింపులు చేయడం సులభం కానుంది. విదేశీ మారక నిల్వల సమస్యను మాల్దీవులు అధిగమించేలా రూ.3,359 కోట్లు(400 మి.డాలర్లు), మరో రూ.3 వేల కోట్ల కరెన్సీ స్వాప్ ఒప్పందాన్ని ప్రకటించారు.

చాన్నాళ్లకు ఆరోగ్యశాఖలో పదోన్నతులు

▸ ఇద్దరికి డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రమోషన్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో చాలా కాలం తర్వాత ఇద్దరికి డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం.లక్ష్మీభాయ్, సీహెచ్.శ్రీనివాసకుమార్‌లకు ప్రమోషన్లు కల్పిస్తూ ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు. లక్ష్మీభాయ్‌ని మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డీడీగా, శ్రీనివాస కుమార్‌ను శ్రీకాకుళం బోధనాసుపత్రి డీడీగా నియమించారు. డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు జాయింట్ డైరెక్టర్ల పదోన్నతులు కల్పించాలని ఉద్యోగుల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. దాదాపు 10-12 ఏళ్ల నుంచి ప్రస్తుతం ఉన్న డిప్యూటీ డైరెక్టర్లకు పదోన్నతులు లేవు. జాయింట్ డైరెక్టర్ పోస్టులు రెండు మాత్రమే ఉన్నాయి. అయితే 10-12 ఏళ్లుగా డీడీలుగా పనిచేస్తున్న అధికారులు చాలా మంది ఉన్నారు. గత ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో 11 జాయింట్ డైరెక్టర్ కేడర్ పోస్టులను సృష్టించింది. ఈ పోస్టులు మొత్తాన్ని రెవెన్యూ సిబ్బందితో నింపాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆరోగ్య శాఖలో పోస్టులు సృష్టించి, రెవెన్యూ అధికారులతో ఆ పోస్టులను ఎందుకు నింపుతున్నారనేది ఎవరికీ అర్థం కావడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏళ్లుగా పదోన్నతులు లేని ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్లకు జేడీలుగా పదోన్నతులు కల్పించి, ఆ 11 పోస్టుల్లో వీరిని నియమించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పోలవరం సందర్శన బకాయిలు విడుదల

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా నడిచాయి. నదీ ప్రవాహ దిశను మారుస్తూ నిర్మిస్తున్న స్పిల్‌వే, స్పిల్ చానల్ సహా ప్రాజెక్టు పనులను రైతులు, విద్యార్థులు, ప్రజలు సందర్శించాలని అప్పట్లో చంద్రబాబు పిలుపిచ్చారు. ఆసక్తి ఉన్నవారిని అన్ని జిల్లాల నుంచి ఆర్టీసీ గరుడ బస్సుల్లో తరలించారు. ప్రాజెక్టు వద్ద వారందరికీ భోజనాలు పెట్టారు. ఇందుకోసం రూ.83.447 కోట్లు వ్యయమైనట్లు పోలవరం ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వీటిలో 2018-19 కాలంలో ఖర్చుచేసిన రూ.23.11 కోట్లు కూడా ఉన్నాయి. వీటిని చెల్లించేలోగా 2019 సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఈ 23.11 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేకపోయింది. అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం.. ఆర్టీసీకి రూ.9.17 కోట్లను, భోజనాలు పెట్టిన హైదరాబాద్‌కు చెందిన స్పిల్‌వే ఎంటర్‌ప్రైజెస్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్‌లకు ఇవ్వాల్సిన రూ.14 కోట్లను చెల్లించలేదు. దరిమిలా లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, స్పిల్‌వే ఎంటర్‌ప్రైజెస్‌లు హైకోర్టును ఆశ్రయించాయి. వాదనలు విన్నాక 12 శాతం వడ్డీతో ఆ బిల్లులను చెల్లించాలంటూ ఈ ఏడాది జనవరి 9వ తేదీన హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను జగన్ సర్కారు బేఖాతర్ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా రూ.23.11 కోట్లను విడుదల చేస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఏఎస్ అధికారి శేషగిరిబాబుకు ఉపశమనం

▸ సింగిల్ జడ్జి తీర్పుపై ధర్మాసనం స్టే

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి శేషగిరిబాబుకు ఉపశమనం లభించింది. కోర్టు ధిక్కార కేసులో ఆయనకు నెల రోజులు సాధారణ జైలు శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఇటీవల ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం స్టే విధించింది. ఉత్తర్వులను 6 వారాల పాటు నిలుపుదల చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న విజయలక్ష్మికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎస్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. శేషగిరిబాబు తరఫున న్యాయవాది రఘువీర్ వాదనలు వినిపించారు.

బోయింగ్ 737 రడ్డర్లలో సమస్య

న్యూఢిల్లీ, అక్టోబరు 7: భారత్‌లోని కొన్ని వైమానిక సంస్థలు వినియోగిస్తున్న బోయింగ్ 737 మోడల్ విమానాల రడ్డర్లలో సమస్య ఉందని డీజీసీఏ హెచ్చరించింది. రడ్డర్ అంటే.. విమానం వెనుక భాగంలో ఉండే ఓ నియంత్రణ వ్యవస్థ. టేకాఫ్ అయ్యేటప్పుడు దీనిని కిందకు దించుతారు. ల్యాండ్ అయ్యే సమయంలో పైకి లేపుతారు. విమానం స్థిరంగా ఉంచేందుకు ఈ వ్యవస్థ పనిచేస్తుంది. కాగా, బోయింగ్ 737 అన్ని మోడల్స్‌లోనూ రడ్డర్ జామింగ్ ఉందని డీజీసీఏ పేర్కొంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్ జెట్, ఆకాశ్ ఎయిర్‌లు బోయింగ్ 737 సిరీస్ విమానాలను వాడుతున్నాయి. అంతేకాక.. ప్రధాని వినిగియోగించేది కూడా ఇదే సిరీస్‌లోనిదే.

నవ్య | చిత్రజ్యోతి



ట్రెండ్‌కు తగ్గట్లుగా...

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా'. నీలిమ గుణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విఘ్నేష్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ను దిల్‌రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ అదిరిపోయింది. నైట్ లైఫ్, డ్రగ్స్ కల్చర్ ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ట్రెండ్‌కు తగ్గట్లు రియలిస్టిక్‌గా ఉన్న ఈ సినిమా సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు. "ఈ సినిమాలో దాదాపు 90 శాతం మంది కొత్త వారే నటించారు. యూత్, పేరెంట్స్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా కథాంశం" అని గుణశేఖర్ అన్నారు.

సంతృప్తినిచ్చింది



ఇటీవలే 'హరోం హర' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు సుధీర్‌బాబు. తాజాగా అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం "మా నాన్న సూపర్‌హీరో". సునీల్ బలుసు నిర్మించారు. సాయిచంద్, షాయజీ షిండే కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

"ఇది బలమైన సంఘర్షణతో నిండిన కథ. ఇద్దరు తండ్రులు.. ఓ కొడుకు మధ్య జరిగే ఆసక్తి కరమైన సినిమా అని చెప్పొచ్చు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఎంతో లోతుగా ఉంటుంది. మానవ సంబంధాల మీద అరుదుగా కొన్ని సినిమాలు వస్తుంటాయి. ఈ సినిమా ఆ కోవకు చెందినదే. ఇందులో నటీనటుల నటన నుంచి కెమెరా యాంగిల్స్ వరకు ప్రతీది సహజంగా ఉండేలా దర్శకుడు కేర్ తీసుకున్నారు. సాయిచంద్, షాయాజీ షిండేలతో నటించడం మంచి వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్. సంగీత దర్శకుడు జైక్రిష్ అద్భుతమైన పాటలను ఇచ్చారు. ఇందులో ఉండే లవ్ ట్రాక్, స్టోరీని పక్కదారి పట్టనీయకుండా సందర్భానుసారం ఉంటుంది. ఇది పక్కా ఫ్యామిలీ చిత్రం. అవుట్‌పుట్ చూశాను. చాలా బాగా వచ్చింది. అందరికీ తప్పక నచ్చుతుంది. నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో అత్యంత సంతృప్తిని ఇచ్చిన చిత్రమిదే. ప్రస్తుతం 'జటాధర' ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. నా కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రమిది" అని చెప్పారు.



రామాయణంలోని పాత్రల ఆధారంగా...

డైరెక్టర్ రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లోని 'సింగం అగైన్'లో అజయ్ దేవ్‌గణ్ నటిస్తోన్న సంగతి తెలిసిందే. దాదాపు అయిదు నిమిషాల నిడివితో ఉన్న ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. రామాయణంలోని ప్రధాన పాత్రలను స్ఫూర్తిగా తీసుకుని దానికి అనుగుణంగా సినిమాను తెరకెక్కిచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో అజయ్ దేవ్‌గణ్‌ను రాముడిగా, కరీనా కపూర్‌ను సీతగా.. అర్జున్ కపూర్‌ను రావణుడిగా, రణ్‌వీర్ సింగ్‌ను హనుమంతుడిగా, టైగర్ ష్రాఫ్‌ను లక్ష్మణునిగా పోల్చి చూపించారు. ఈ ట్రైలర్‌లో దీపికా పదుకొణె, అక్షయ్‌కుమార్ కూడా తళుక్కుమన్నారు. దీపావళి కానుకగా నవంబర్ 1న సినిమా విడుదలవుతోంది.

తెలుగు డబ్బింగ్‌లకు తమిళ టైటిల్సా?



'బొమ్మరిల్లు', 'కిక్', 'ఎవడు' సినిమాలతో సినీ రచయితగా మంచి గుర్తింపు పొందారు అబ్బూరి రవి. ప్రస్తుతం 'డెకాయిట్' సినిమాకు పని చేస్తున్న ఆయన.. ఎక్స్ వేదికగా తెలుగులో రిలీజ్ అవుతున్న డబ్బింగ్ సినిమా టైటిల్స్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగువారికి సుపరిచితం కాని పేర్లతో సినిమాల టైటిల్స్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. "తెలుగు ప్రేక్షకులని అగౌరవపరుస్తున్నారు. ఒకప్పుడు 'డబ్బింగ్' సినిమాలకు తెలుగు పేర్లు పెట్టేవారు. ఇతర భాషలలో ఉండే బోర్డులని చక్కగా తెలుగులోకి మార్చేవారు. ఇప్పుడు అదంతా మానేసి విడుదల చేస్తున్నారు. ఆయా భాషల గొప్పతనాన్ని.. వారి కళాత్మకతని గౌరవిస్తాను. కానీ తెలుగు ప్రేక్షకులని ఇంత తేలికగా తీసుకోవటం నచ్చట్లేదు. తెలుగుని గౌరవించని వాళ్లని కూడా తెలుగువారు గౌరవించడం, ఆదరించడం.. ఆ సినిమాలను చూడటం కోసం మన డబ్బులు ఖర్చు పెట్టడం గొప్పతనమని నేను మాత్రం అనుకోవట్లేదు" అని పేర్కొన్నారు. ఈ ట్వీట్ ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. మంచి పాయింట్‌ను లేవనెత్తారు అంటూ నెటిజన్లు రవి పోస్ట్‌కు మద్దతు పలుకుతున్నారు. 'కంగువ', 'వేట్టయాన్', 'తంగలాన్', 'రాయన్' 'వలిమై', లాంటి పేర్లు పలకడానికే కష్టంగా ఉన్నాయి.. అయినా అటువంటి టైటిల్స్ బదులు చక్కగా తెలుగు టైటిల్స్ పెట్టొచ్చు కదా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

నవ్వించే సినిమా

ఇన్ ప్రోగ్రెస్




సుహాస్, సంగీర్తన హీరోహీరోయిన్లుగా నటించిన 'జనక అయితే గనక' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం మచిలీపట్నంలో జరిగింది. ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు దిల్ రాజు మాట్లాడుతూ 'మీ జిల్లా వాడు, మీలో ఒకడైన సుహాస్ నటించిన సినిమా ఇది. 'జనక అయితే గనక' పెద్ద హిట్ కాబోతోంది. అందరినీ నవ్వించే సినిమా ఇది' అని తెలిపారు. ఈ చిత్ర విజయం మీద ఎంతో నమ్మకం ఉందని హీరో సుహాస్ చెప్పారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు కూడా పాల్గొన్నారు.



మేజర్ వరదరాజన్ కథ

శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటిస్తున్న 'అమరన్' చిత్రం నుంచి తొలి పాట 'హే రంగులే'ను హీరో నితిన్ విడుదల చేశారు. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, రమ్య బెహర పాడారు. శివ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' కథ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సుధాకరరెడ్డి, నిఖితా రెడ్డి ఈ నెల 31న తెలుగులో విడుదల చేస్తున్నారు.

మాస్ జాతర



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి 'ఆడు ఆడు ఆడు నిలువెల్లా పూనకమై' అంటూ సాగే జాతర సాంగ్ విడుదల చేశారు. పూనకాలు తెప్పించే రీతిలో ఉన్న ఈ పాటలో హీరోహీరోయిన్లు పాల్గొన్నారు. 'క' చిత్రాన్ని వంశీ నందిపాటి తెలుగులో, హీరో దుల్కర్ సల్మాన్ మలయాళంలో విడుదల చేస్తున్నారు.



పీరియాడిక్ ప్రేమకథ

మంచు లక్ష్మి ప్రధాన పాత్ర పోషించిన పీరియాడిక్ ప్రేమకథ 'ఆదిపర్వం' ఈ నెల 31న విడుదల కానుంది. ఆదిత్య ఓం మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథ ఇదని దర్శకుడు సంజీవ్ మేగోటి చెప్పారు.మంచు లక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా ఆమె క్యారెక్టర్ లుక్‌ను విడుదల చేశారు. ఇంతవరకూ చేయని సరికొత్త పాత్రను ఇందులో ఆమె పోషించారు. 1974-90 మధ్య కాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు దర్శకుడు చెప్పారు. దుష్టశక్తికి, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధం ఇదని అన్నారు. రెట్రో ఫీల్‌తో లవ్‌స్టోరీగా 'ఆదిపర్వం' మొదలై యాక్షన్ థ్రిల్లర్‌గా అలరిస్తుందని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఘంటా శ్రీనివాసరావు చెప్పారు. తెలుగు సినిమాల్లో ఇదొక గొప్ప ప్రయత్నం అని సహ నిర్మాత గోరెంట శ్రావణి చెప్పారు. రావుల వెంకటేశ్వరరావు సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంది.

బౌద్ధ శిలాఫలకంపై బ్రాహ్మి ప్రాకృతి భాషలో శాసనం



ధరణికోటలో లభ్యమైన పాలరాతి శిలాఫలకం

అమరావతి, అక్టోబరు 7: గత మంగళవారం అమరావతి మండలం ధరణికోట రెవెన్యూ పరిధిలోని కొమ్మినేని పిచ్చియ్య పొలంలో లభ్యమైన బౌద్ధ శిలాఫలకంపై ఉన్న లిపిని బ్రాహ్మి ప్రాకృతి భాషగా కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ గుర్తించారు. శిలాఫలకంపై 'ప్రపుతారకాన మహా బాలకాయ, హతనావినియ చాయతాబో' అని లిఖించబడి ఉంది. శిలాఫలకాన్ని ప్రపుతార కాన అనే బౌద్ధ భిక్షువు బహూకరించినట్లు తెలుస్తుంది. అందుకు గుర్తుగా శిలాఫలకంపై శాసనం చేసినట్లు పురావస్తుశాఖ అధికారి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దాచేపల్లి, అక్టోబరు 7: నడికుడి రైల్వే స్టేషన్ వద్ద రైలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం మధ్యలో 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు చొక్కా, బ్లూకలర్ ప్యాంటు, కుడిచేతి వేలికి వెంకటేశ్వరస్వామి బొమ్మ కలిగిన వెండి ఉంగరం ఉంది. పూర్తి సమాచారం కోసం 9440309859ను సంప్రదించగలరు.

శీతల గిడ్డంగుల లైసెన్సుల రెన్యువల్స్ పెండింగ్

- దుగ్గిరాలలో అగ్నిప్రమాదం జరిగిన తర్వాత నిలుపుదల
- ఎన్‌వోసీలు, ఇతర నిబంధనల విషయంలో కొరవడిన స్పష్టత
- ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోని మార్కెటింగ్ శాఖ

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా శీతల గిడ్డంగుల లైసెన్సుల రెన్యువల్స్ నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు దుగ్గిరాలలోని కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు కొన్ని లోపాలు బయటపడటంతో వాటిని ఆధారంగా చేసుకొని లైసెన్సుల రెన్యువల్స్‌ని మార్కెటింగ్ శాఖ చేయడం లేదు. దీనివలన సాంకేతికంగా సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇదే విషయాన్ని శీతల గిడ్డంగుల యాజమాన్యాలు మార్కెటింగ్, అగ్నిమాపక శాఖల దృష్టికి తీసుకెళ్లినా ఇంకా విధానపరమైన నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం చాలా కోల్డ్‌స్టోరేజ్‌లు లైసెన్సులు లేకుండానే వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఏదైనా జరిగితే నష్టపరిహారం విషయంలో బీమా కంపెనీలు ఇబ్బంది పెట్టే అవకాశం లేకపోలేదు.

భద్రత ప్రమాణాలు తప్పనిసరి..

కోల్డ్‌స్టోరేజ్‌ల్లో భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి. ప్రతి గిడ్డంగిలో అగ్నిమాపక పరికరాలు, అలారంలు అమర్చాలి. అలానే ఏదైనా ప్రమాదం జరిగితే వెనువెంటనే నీటిని వెదజల్లేలా స్ప్రింకర్లు, వాటర్ పైపులన్ను ఏర్పాటు చేయాలి. ప్రతి ఛాంబర్‌లో సీసీ టీవీలు అమర్చాలి. అగ్నిమాపక శాఖ అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎన్‌వోసీని జారీ చేస్తుంది. ఆ తర్వాత మార్కెటింగ్ శాఖ లైసెన్సుని రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. అయితే దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఎన్‌వోసీ లేకుండానే మార్కెటింగ్ శాఖ లైసెన్సుని మంజూరు చేసింది. ఆ సంఘటన అనంతరం జరిగిన విచారణలో మార్కెటింగ్ శాఖ వైఫల్యం ప్రస్ఫుటమైంది. ఇప్పటివరకు రైతులకు బీమా పరిహారం అందకపోవడానికి ఇది కూడా ఒక కారణంగా మారింది. అప్పటి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 130కి పైగా కోల్డ్‌స్టోరేజ్‌ల రెన్యువల్స్‌ని మార్కెట్ కమిటీలు నిలిపేశాయి. దీనివలన మార్కెట్ కమిటీలకు ఆదాయం కూడా తగ్గిపోయింది. మార్కెటింగ్, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు ఈ విషయంలో చర్చించుకుని విధానపరమైన నిర్ణయాన్ని తీసుకొని లైసెన్సులు రెన్యువల్ చేయకపోతే రాబోయే రోజుల్లో సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉంది. కాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాల వారీగా మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసింది. దీనివలన ఇప్పుడు అనేక సమస్యలు వస్తున్నాయి. ప్రత్తిపాడుకు మార్కెట్ యార్డు లేదు. పెదనందిపాడులో కొనసాగుతుంది. కాగా ఎన్‌హెచ్-16కి ఆనుకునే ఉన్న కోల్డ్‌స్టోరేజ్‌లన్నింటినీ ఆ నియోజకవర్గంలో చేర్చారు. దీనివలన తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని యజమానులు చెబుతున్నారు. గతంలో వలే గుంటూరు ఏఎంసీ పరిధిలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.



దుగ్గిరాల మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్ బంధువులు కొమ్మినేని కమలకుమారి, యార్లగడ్డ హనుమంతరావు, లలితకుమారి రాష్ట్ర ఐటీ, విద్య, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలిసి రూ.4 లక్షల చెక్కును సీఎం సహాయ నిధికి అందించారు. - దుగ్గిరాల

ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని ఆత్మహత్య



కసిన్యా నాయక్ (ఫైల్ ఫొటో)

మాచర్ల రూరల్, అక్టోబరు 7: తండ్రి డబ్బులు ఇవ్వడం లేదని ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అచ్చమ్మకుంటలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బాణావత్ కసిన్యా నాయక్ (22) ఇంటర్ వరకు చదువుకుని హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఊరికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. స్నేహితులతో సరదాగా తిరుగుతూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో ఖర్చులకు తండ్రి రూప్‌సింగ్‌ను డబ్బులు అడుగగా తండ్రి నిరాకరించడంతో మనస్తాపం చెంది సాయంత్రం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు అచ్చమ్మకుంట గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని తల్లి బాణావత్ లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

శావల్యాపురం, అక్టోబరు 7: కాలువలో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన మండలంలోని గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద సోమవారం జరిగింది. స్థానిక ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు వినుకొండ పట్టణానికి చెందిన కల్వకుంట సతీష్‌బాబు(23) తన మామయ్య సుందర్రావుతో కలసి సోమవారం సాయంత్రం అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దకు ఈతకు వెళ్లాడు. కెనాల్‌లో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో కెనాల్‌లోకి దిగిన వెంటనే సతీష్‌బాబు నీటిలో మునిగిపోయి గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే వెతుకులాట ప్రారంభించినప్పటికీ సతీష్‌బాబు ఆచూకీ దొరకలేదు. విషయాన్ని స్థానిక ఎస్ఐ లోకేశ్వరరావుకు తెలుపగా ఆయన సిబ్బందితో కెనాల్ వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్ అధికారులకు సమాచారం అందించారు. గల్లంతైన సతీష్‌బాబు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

దుగ్గిరాల, అక్టోబరు 7: కాల్వలో ఈత కొడుతూ ప్రవాహంలో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యమైంది. రేవేంద్రపాడు వద్ద రేపల్లె కాల్వలో వడ్లపూడికి చెందిన కార్ మెకానిక్ మహ్మద్ ఖాజా(27) ఈత కొడుతూ ప్రవాహ ఉధృతిలో కొట్టుకుపోయిన విషయం విదితమే. పెదపాలెం సమీపంలో రేపల్లె కాల్వలో ఖాజా మృతదేహాన్ని సోమవారం సాయంత్రం గుర్తించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఖాజా మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై ఎస్.వెంకటరవి తెలిపారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

చిలకలూరిపేట, అక్టోబరు 7: చిలకలూరిపేట అర్బన్ పోలీసులు సోమవారం పట్టణంలోని వేలూరు రోడ్డులో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక మినీ ఆటోలో ఒక్కొక్కటి 50 కిలోల బియ్యంతో ఉన్న 60 బస్తాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఆ వాహనాన్ని అడ్డుకొని స్వాధీనం చేసుకున్నారు. వాహనం డ్రైవర్ పురుషోత్తంను అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని తూర్పు మాలపల్లెలోని ఒక డీలర్‌కు సంబంధించిన బియ్యంగా వీటిని గుర్తించారు. అనంతరం సరకును రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్త చెవి కొరికిన కోడలు

తుళ్లూరు, అక్టోబరు 7 : అత్త కుడి వైపు చెవిని కోడలు కొరికిన సంఘటన ఆదివారం రాత్రి తుళ్లూరు బాలయేసు కాలనీలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కంభంపాటి శేషగిరికి అత్తలూరుకు చెందిన పావనికి పదేళ్ల క్రితం వివాహం అయింది. ఉమ్మడిగా కుటుంబంగా ఉంటున్నారు. తరచూ అత్త కంభంపాటి నాగమణికి కోడలు పావనికి గొడవలు జరుగుతున్నాయి. గతంలో కూడా కోడలు తరఫు బంధువులు వచ్చి అత్త, మామలు నాగమణి , కంభంపాటి సాయిబాబు, భర్త శేషగిరిని కొట్టి వెళ్లారు. ఆదివారం రాత్రి కూడా అమరావతి మండలం అత్తలూరుకు చెందిన కోడలి తండ్రి ఈపూరి వీరయ్య, తల్లి మరియమ్మ, పిన్ని ఏసమ్మ తుళ్లూరులో ఇంటికి వచ్చి గొడవ పడ్డారు. ఈ క్రమంలో కోడలు పావని అత్త నాగమణి చెవిని కొరికేసింది. 108 కి ఫోన్ చేసినా రాలేదు. ఆటోలో గుంటూరు ప్రభుత్వ హాస్పటల్‌కి బంధువులు తీసుకెళ్లారు. 108 వాహనం కోసం ఎదురు చూడటంతో వైద్యం జాప్యం జరిగింది. చెవిని అతికించటానికి అవకాశం లేకుండా పోయిందని బాధితురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో వచ్చి ఉంటే తెగిపోయిన చెవికి సర్జరీ చేసేవాళ్లమని, సమయం మించి పోవటంతో పనికి రాకుండా పోయిందని డాక్టర్లు చెప్పినట్టు బంధువులు తెలిపారు. హాస్పటల్ పోలీస్ అవుట్ పోస్టులో బాధితురాలు ఫిర్యాదు చేశారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 7: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 588.60 అడుగులు ఉంది. ఇది 307.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9349 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,457 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 51,457 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 7: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 30,722 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు నుంచి 33,547 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణానదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

39,293 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,193 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 39,293 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,929 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	16300	334	9500	16000
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	9500	12000
273	10000	12000	273	12000	13200
341	8500	15500	341	10500	15500
4884	--	--	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18600	తేజ	9000	18500
బ్యాడిగి	9500	15500	బ్యాడిగి	8000	17000
దేవనూరు డీలక్స్	9000	16500	దేవనూరు డీలక్స్	9000	16500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	11000

రైతు సరుకుకు కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యాలదే బాధ్యత

- మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు స్పష్టీకరణ

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కోల్డ్‌స్టోరేజ్‌లలో రైతులు నిల్వ చేసిన మిర్చి బస్తాలను యాజమాన్యాలు, కమీషన్ వ్యాపారస్తులు కలిసి అమ్మేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని మార్కెటింగ్ శాఖ విజయవాడ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం మిర్చియార్డు పరిపాలన భవనంలో ఆయన కోల్డ్‌స్టోరేజ్‌ల అసోసియేషన్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన మోసం లాంటి సంఘటనలు పునరావృతం కారాదని స్పష్టం చేశారు. ఆ కేసు విషయంలో రైతులకు న్యాయం చేస్తున్నామని, మొత్తం 54 మంది రైతుల సరకు వారికి తెలియకుండా విక్రయించారన్నారు. అయితే వారిలో 30 మందికి చెల్లింపులు జరిగినట్లు పోలీసు శాఖ విచారణలో తేలిందని, మిగతా 24 మందికి చెల్లించాల్సిన రూ. 63 లక్షలకు సంబంధించి కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసినట్లు తెలిపారు. కొంతమంది కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు అనధికారికంగా లీజుకు ఇస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని, లీజు ఏదైనా అధికారికంగా జరగాలని సూచించారు. లీజుకు తీసుకున్న వ్యక్తి మార్కెట్ కమిటీ నుంచి లైసెన్సు పొందాలన్నారు. రైతులకు కావాలని నష్టం కలిగిస్తే స్టోరేజ్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ మిర్చిని కమీషన్ వ్యాపారస్తుల ద్వారా కాకుండా వారే స్వయంగా నిల్వ చేసుకుని బాండ్‌లు పొందాలని సూచించారు. కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం తన వద్ద నిల్వ చేసిన సరుకుకు అప్పటి మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇన్సూరెన్స్ చేయాలన్నారు. బ్యాంకులు రుణాలు అన్ని నిబంధనలు చూసుకుని ఇవ్వాలని సూచించారు. కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి సరుకు బయటకు తీసి యార్డుకు తీసుకొచ్చినప్పుడు అన్ని విషయాలు తెలియజేయాలని చెప్పారు. వేమెన్‌లు తూకం వేసేటప్పుడు పట్టీలో బాండ్ నంబరు, కోల్డ్‌స్టోరేజ్ పేరు విధిగా రాయాలన్నారు. సమావేశంలో మిర్చియార్డు సెక్రటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, కోల్డ్‌స్టోరేజ్‌ల సంఘం నాయకులు ప్రకాశరావు, సురేంద్రబాబు, కర్లపూడి వెంకటేశ్వరరావు, కె.మార్కు శ్రీనివాసరెడ్డి, కొత్తూరి సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మిర్చియార్డు పరిపాలన భవనంలో కోల్డ్‌స్టోరేజ్‌ల అసోసియేషన్ నేతలతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ, ఇతర అధికారులు

బాలిక కుటుంబంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మస్తాన్‌వలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రమాదేవి

రేపల్లె, అక్టోబరు7: బాలిక కుటుంబంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి పి.రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో దాడికి గురైన మస్తాన్‌వలి కుటుంబాన్ని ఐద్వా సీపీఎం నేతలు పరామర్శించారు. ప్రభుత్వ వైద్యశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రేమ పేరుతో బాలిక కుటుంబంపై దాడి చేయడం దారుణం అన్నారు. ప్రేమ పేరుతో వేధించడమేగాక, అర్ధరాత్రి బాలిక ఇంట్లోకి వెళ్లి తల్లిదండ్రులు, బాలిక మీద విచక్షణారహితంగా దాడి చేయడం దురదృష్టకరం అన్నారు. గత ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలం అయిందని, కూటమి ప్రభుత్వమైనా దాడులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం జరగకపోతే ప్రజా సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, వెంకట్రామయ్య, కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణ్‌రావు, కె.ధర్మరాజు, డానియేలు, వైనవీస్ పాల్గొన్నారు.

బదిలీల వ్యవహారంలో జడ్పీ ఉద్యోగులు సంతృప్తి

- జిల్లాపరిషత్తు చైర్‌పర్సన్ హెన్రీ క్రిష్టినా



గుంటూరు సిటీ, అక్టోబరు 7: ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో జిల్లా పరిషత్తు ఉద్యోగులు చాలా వరకు సంతోషంగా ఉన్నారని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిష్టినా అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వందలాది మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న జిల్లా పరిషత్తులో అందరికీ అనుకూలమైన స్థానాలు దక్కవని చెప్పారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఎవరైతే అర్హులో వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని బదిలీల ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. ఈ వ్యవహారంలో ఎక్కడా సొంత ఆలోచన చేయలేదన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పారదర్శకంగా వ్యవహరించామన్నారు. దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న వారిని బదిలీ చేయాల్సి వచ్చిందని చెప్పారు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసే విషయంలో కొంతమంది అధికారులు తాత్సారం చేసిన విషయం వాస్తవమేనన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిన తర్వాత సమస్యని పరిష్కరించే ప్రయత్నం చేశానని పేర్కొన్నారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి బయటి వ్యక్తుల స్వార్థపూరిత ఆలోచనలను తాను అమలు చేయలేదన్న అక్కసుతోనే ఈ విధమైన ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

భార్యను అసభ్యంగా మాట్లాడాడని హత్య

- బుర్రిపాలెం రోడ్డులో హత్యకేసు నిందితుడి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పక్కన ట్రైనీ డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

తెనాలిరూరల్, అక్టోబరు 7: ఇద్దరి స్నేహితుల మధ్య అప్పు చెల్లింపులో వచ్చిన వివాదం కాస్త భార్య, పిల్లల పట్ల అసభ్యకరంగా మాట్లాడే దాకా చేరి చివరికి హత్యకు దారితీసిందని డీఎస్పీ జనార్దన్ రావు చెప్పారు. ఈ నెల 2న బుర్రిపాలెం రోడ్డులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పోలిశెట్టి కోటేశ్వరరావు (36) కేసును పోలీసులు ఛేదించారు. సోమవారం రూరల్ సీఐ కార్యాలయంలో నిందితుడిని మీడియాముందుంచి కేసు వివరాలను డీఎస్పీ జనార్దన్‌రావు, ట్రైనీ డీఎస్పీ భార్గవి మర్రివాడ, సీఐ బెల్లం శ్రీనివాసరావు వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ బుర్రిపాలెంకు చెందిన పోలిశెట్టి కోటేశ్వరరావు, తెనాలి నాజర్‌పేటకు చెందిన షేక్ ఆదామ్ షఫీ ఇద్దరు ఎప్పటి నుంచో స్నేహితులు. అయితే ఆదామ్ షఫీకి ఆర్థికంగా ఇబ్బందులు రావడంతో పోలిశెట్టి కోటేశ్వరరావు వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లింపు విషయంలో ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆదామ్ షఫీకి మృతుడు కోటేశ్వరరావు పలుమార్లు ఫోన్ చేసి డబ్బులు చెల్లించకపోతే నీ భార్యని నా వద్దకు పంపు అంటూ అభ్యంతర కరంగా మాట్లాడటంతోపాటు నీ పిల్లలు కూడా నాకే పుట్టారంటూ అసభ్యకరంగా మాట్లాడేవాడు. అతడి మాటలతో విరక్తిపుట్టిన ఆదామ్ షఫీకి కోటేశ్వరరావును చంపాలన్న ఆలోచన బలంగా కలిగింది. దీంతో ఈనెల 1న బుర్రిపాలెం రోడ్డులోని ఖాళీ స్థలంలో ఇద్దరు కలిసి మద్యం తాగారు. కోటేశ్వరరావుకు మత్తుబాగా ఎక్కేలా తాగించిన ఆదామ్ షఫీ అదే అదునుగా తన వెంట తెచ్చుకున్న బటన్ కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టగా వారి విచారణలో నిందితుడు షేక్ ఆదామ్ షఫీ హత్య చేసినట్లు నిర్ధారించారు. అతడిని సోమవారం తెనాలి కబేలా వంతెన వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ జనార్దన్‌రావు ప్రత్యేకంగా అభినందించారు.

మూడు కోట్లు మూట కట్టుకున్న మోసగాళ్లు

గుంటూరు, అక్టోబరు 7: ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీ ఇస్తామంటూ కోట్లాది రూపాయలు వసూలు చేసుకుని ముఖం చాటేసిన ఘరానా మోసగాళ్ల ముఠా వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మీరు కేవలం రూ. లక్ష చెల్లిస్తే మీకు ప్రతి వారం రూ. 3,600 చొప్పున 50 వారాలు తిరిగి చెల్లిస్తాం. అంటే మీకు 7 రూపాయల వడ్డీ వచ్చినట్లు అవుతుంది అని నమ్మించారు. మీరు ఇచ్చే లక్షకు మాది గ్యారంటీ అంటూ ప్రజలను ఆకట్టుకునేలా మోసపూరిత వాగ్దానాలు ఇచ్చారు. మీరు చెల్లించిన లక్షకు మీ పేరుతో కంపెనీ 100 చదరపు గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తుంది. 50 వారాలు ముగిసిన తర్వాత ఆ స్థలాన్ని మీరు కంపెనీ పేరుతో తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలి అంటూ ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రజలను ఆకట్టుకొని మూడు కోట్లు మూట కట్టుకుని ఉడాయించిన మోసగాళ్లపై బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయల రాజారావు అనే వ్యక్తి ఆర్ఆర్ఆర్ ఇన్ఫ్రా డెవలప్‌మెంట్ పేరుతో ఓ సంస్థను స్థాపించాడు. హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో ఓక్లాండ్ ఇన్ఫ్రా అనే సంస్థను స్థాపించాడు. ఈ క్రమంలో కరారి ఎస్ఎస్‌వీ చలపతిరావు అలియాస్ శేషు, పాలపర్తి సారథి అనే ఇద్దరిని ఏజెంట్లుగా నియమించుకున్నాడు. ఈ ముగ్గురు ప్రతిపాడు నియోజకవర్గ పరిధిలోని పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలాల్లోని పైన చెప్పిన విధంగా ప్రజలను నమ్మించి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల నుంచి సుమారు 585 మంది ఒక్కొక్కరు లక్ష చొప్పున చెల్లించారు. మొదట్లో అనుమానం రాకుండా ఉండేందుకుగానూ కొద్దిమందికి రెండు, మూడు వారాలు చెల్లింపులు జరిగాయి. ఈ విధంగా మూడు కోట్లు వసూలు చేసుకున్న తర్వాత నిర్వాహకులు ముఖం చాటేశారు. దీంతో గత సోమవారం బాధితులు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా ప్రత్తిపాడు స్టేషన్‌కు పంపినట్లు బాధితులు తెలిపారు. సోమవారం మరోసారి బాధితులైన పెదనందిపాడు మండలానికి చెందిన నాగ గోపి, నాగేశ్వరరావు, చంద్ర నాయక్, వినోద్ కుమార్ తదితరులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

బాపట్ల వార్తలు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

వేమూరు ఎంపీడీవోగా శ్రీమన్నారాయణ

వేమూరు, అక్టోబరు 7: వేమూరు ఎంపీడీవోగా శ్రీమన్నారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సమయం ముందు జరిగిన బదిలీల్లో కృష్ణా జిల్లాకు చెందిన శేషగిరిరావు వేమూరు ఎంపీడీవోగా వచ్చారు. ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా శేషగిరిరావు తిరిగి కృష్ణా జిల్లాకు వెళ్లిపోవడంతో తుళ్లూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీమన్నారాయణను ప్రభుత్వం వేమూరుకు బదిలీ చేసింది.

ఎంఈవోగా శేష గోపాలం..

రేపల్లె, అక్టోబరు7: నిజాంపట్నం మండలంలోని విద్యాశాఖలో ఎంఈవోలుగా శోభాచంద్ శేషగోపాలం సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పాఠశాలలను అభివృద్ధి చేయటంతో పాటు అర్హులైన వారికి మెరుగైన విద్యను అందిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈవోపీఆర్డీగా రవిశంకర్

రేపల్లె, అక్టోబరు 7: నిజాంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈవోపీఆర్డీగా మాకినేని రవిశంకర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం మండలంలోని అన్ని గ్రామాలపై అవగాహన చేసుకుని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

హౌసింగ్ ఏఈగా పద్మావతి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 7: పిట్టలవానిపాలెం మండల నూతన హౌసింగ్ ఏఈగా ఎస్.పద్మావతి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో ఐ.సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు.

పంచాయతీ కార్యదర్శిగా సుజాత

పిట్టలవానిపాలెం, అక్టోబరు 7: మండలంలోని చందోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బి.సుజాతను చందోలు గ్రామ టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, మైనార్టీ మండల నాయకులు షేక్.మీరా సోమవారం మర్యాద పూర్వంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

చింతాయపాలెం పీఎస్‌గా రాజశేఖర్

కర్లపాలెం, అక్టోబరు 7 : కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను గ్రామ సర్పంచి పీతా శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజశేఖర్ అడవి పంచాయతీ నుంచి బదిలీపై వచ్చారు.

పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

రేపల్లె, అక్టోబరు 7: రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ పరిష్కార వేదికకు ఆరు అర్జీలు వచ్చాయని తెలిపారు. రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీ మోహన్‌రావు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించనున్న 30 జిల్లాల ప్రణాళికలో రేపల్లె రెవెన్యూ డివిజన్‌ను తెనాలి జిల్లాలో విలీనం చేయాల్సిందిగా కోరుతూ అర్జీ అందించారు. రేపల్లె మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన సబ్బినేని సత్యనారాయణ ఇంటి స్థలం ఆక్రమించారని, తొలగించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. నిజాంపట్నం మండలం అడవులదీవికి చెందిన ఒడుగు రాంబాబు తన పొలమును ఆన్‌లైన్ చేయాల్సిందిగా కోరుతూ అర్జీ ఇచ్చారు. గుంటూరుకు చెందిన బసువుల సాంబశివరావు తన భూమి ఆన్‌లైన్ చేయాల్సిందిగా కోరుతూ అర్జీ, వేమూరు మండలం వేమూరుకు చెందిన దున్నా సుమలత వారి కుటుంబ సభ్యుల మధ్య గల సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ, కొల్లూరు మండలం పోతార్లంకకు చెందిన గురిపర్తి వెంకటేశ్వరరావు భూమిని ఆన్‌లైన్ చేయాల్సిందిగా కోరుతూ అర్జీ దాఖలు చేశారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

వార్డు సభ్యుల పాత్ర కీలకం

అమృతలూరు, అక్టోబరు 7 : పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర ముఖ్యమైనది అని ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉప సర్పంచ్‌లకు, ఒకొక్క గ్రామ పంచాయతీ పరిధిలో ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలు కీలకం అన్నారు. ఆయా వార్డులో ఉన్న సమస్యలను పంచాయతీ దృష్టికి తీసుకురావాలని సభ్యులకు సూచించారు. తద్వారా సమస్యల పరిష్కారానికి పంచాయతీ కృషి చేస్తుందన్నారు. ఎంపీడీవో మారుతీశేషమాంబ మాట్లాడుతూ పంచాయతీ సాధారణ పరిపాలన విధానంతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

పిట్టలవానిపాలెం, అక్టోబరు 7 : గృహాల శుభ్రతతోపాటు గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం, గ్రామ వీధులు తదితర అంశాలను గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు తెలుసుకోవడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని పిట్టలవానిపాలెం ఎంపీడీవో ఐ.సత్యనారాయణ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. శిక్షకులుగా షేక్.రబ్బాని, రావిపాటి వెంకట్‌లు పాల్గొని ఉపసర్పంచులు, వార్డుసభ్యులకు పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వివరించారు. గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి, ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, ఎంఈవో -1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు, గ్రామ పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆశయ సాధనకు కృషి

కర్లపాలెం, అక్టోబరు 7 : రెడ్‌క్రాస్ ఆశయ సాధనకు కృషి చేద్దామని కర్లపాలెం తహసీల్దార్ కేవీబీటీ సుందరమ్మ అన్నారు. కర్లపాలెం తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సుందరమ్మను కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యూనియన్ సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుందరమ్మ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమజానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు, కర్లపాలెం రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఎం.పరమానందకుమార్, వి.వెంకట్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సత్కారం


ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచి సుమతి

వేమూరు, అక్టోబరు 7: మండలంలోని పెనుమర్రు గ్రామ పంచాయతీ పరిధిలో బదిలీ అయిన నలుగురు ఉద్యోగులను సోమవారం సన్మానించారు. సర్పంచి కొక్కిలిగడ్డ సుమతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వో జితేంద్ర, లైన్మెన్ మనోజ్, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్నల సేవలను కొనియాడారు. ఆ నలుగురిని దుశ్శాలువాలతో, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నె వేణుగోపాలకృష్ణ (పసి), వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడు మృతదేహం లభ్యం

కొల్లూరు అక్టోబరు 7 : కృష్ణానదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఏడుకొండలు సోమవారం సాయంత్రం తెలిపారు. ఆదివారం తెనాలి బీసీ కాలనీకి చెందిన బొడ్డపాటి నరేష్ (20)మండల పరిధిలోని చిలుమూరు వద్ద కృష్ణానదిలో దిగి నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గాజుల్లంక సమీపంలో కృష్ణానదిలో యువకుడు మృతదేహం లభ్యం కావడంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

చేపల చెరువుల బహిరంగ వేలం పాట

చుండూరు, అక్టోబరు 7 : ఆలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరు చెరువులకు చెందిన 48 ఎకరాల విస్తీర్ణంలోని చేపల చెరువులకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజు సోమవారం తెలిపారు. ఈ పాటలో పాల్గొనే పాటదారులు ముందస్తుగా ధరావత్తు చెల్లించి పాల్గొన్నాలని, నిబంధనలు పాటించాలని కార్యదర్శి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కర్లపాలెం, అక్టోబరు 07: కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదంలో పడ్డారు దిబ్బ గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

చండికాదేవిగా అమ్మవారి దర్శనం


బాపట్ల : మహాచండికాదేవిగా


రేపల్లె: రాజరాజేశ్వరిగా


చెరుకుపల్లి: అన్నపూర్ణాదేవిగా..


చందోలు: రాజశ్యామలా దేవిగా..


గోవాడ: గాయత్రీ దేవిగా


చండికాదేవి అలంకరణలో అమ్మవారు

బాపట్ల, అక్టోబరు 07: దేవిశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మహాచండికాదేవిగా పలుప్రాంతాల్లో దర్శనమిచ్చారు. టౌన్‌హాలులోని లలితా త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా అమ్మవారు మహాచండిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, విశేష నివేదనలు అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగాయి. చంద్రగ్రహ ఆరాధన, దీపార్చన అనంతరం మహిళలచే లలిత సహస్రనామ పారాయణం జరిగింది. శంకర విద్యాలయంలో అమ్మవారు శ్రీగాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జీబీసీరోడ్డులోని పోలేరమ్మతల్లి దేవాలయంలో, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాచండీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమచ్చారు.

రేపల్లె, అక్టోబరు7: శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా సోమవారం విఘ్నేశ్వరపూజ, అమ్మవారికి కుంకుమ పూజ, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో కాళికాదేవి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారిగా భక్తులకు దుర్గమ్మ దర్శనమిచ్చింది పట్టణంలోని ఇసుకపల్లి చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయంలో రైలుపేట అభయాంజనేయస్వామి దేవాలయంలో శారదాపీఠంలోని, రెల్లికాలనీలో, 3వవార్డు రామమందిరం వద్ద అరవ పల్లి గ్యాస్ కంపెనీ వద్ద అమ్మవారికి కుంకుమపూజ, లలితా సహస్రనామం తదితర పూజలు నిర్వహించారు.

చెరుకుపల్లి, అక్టోబరు 7: శరన్నవరాత్రి ఉత్సవాలను వైభోవపేతంగా నిర్వహిస్తున్నారు. 5వరోజు అమ్మవారు పలు గ్రామాల్లో వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆళ్ళవారిపాలెం, రాజవోలు, కనగాల, తూర్పుపాలెం, నడింపల్లి, గూడవల్లి, గుళ్ళపల్లి, చెరుకుపల్లి గ్రామాల్లో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. చెరుకుపల్లిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.


వలివేరు: గాయత్రీ దేవిగా అమ్మవారు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 7: చందోలులోని శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమ్మవారు శ్రీరాజశ్యామలాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరులో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమృతలూరు, అక్టోబరు 7 : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు సోమవారం గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకటశ్రీనివాసశర్మ నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో పలు అలయాల్లో, మందిరాల్లో వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వేమూరు, అక్టోబరు 7: సోమవారం జంపని రామేశ్వరాలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. చావలి వాలేశ్వరాలయంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్త సమాజాల వారు భజన కీర్తనలు ఆలపించారు.

కర్లపాలెం, అక్టోబరు 7: కర్లపాలెం మండలం బోలాయపాలెంలో ఐదో రోజు అమ్మవారిని చండికాదేవి అలంకరణలో భక్తులచే పూజలు అందుకున్నారు. పెదపులుగువారిపాలెం గ్రామంలో చిన్న అక్కలవారి ఇలవేల్పు వీర్లంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు.

చుండూరు, అక్టోబరు 7: వలివేరులోని లలితాంబ సమేత స్వయంభువేశ్వర ఆలయంలో అమ్మవారు లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చినపరిమిలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు మహాచండీ రూపంలో నిండైన అలంకరణతో భక్తులకు దర్శనవిచ్చారు.


జంపని రామేశ్వరాలయంలో పూజలో పాల్గొన్న బాలికలు

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 150 అర్జీలు


ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ జె.వెంకటమురళికి అందజేస్తున్న అర్జీలు

బాపట్ల, అక్టోబరు 07 : ప్రజాసమస్యల పరిష్కారవేదికలో గడువు తీరిన అర్జీలు అపరిష్కృతంగా ఉండరాదని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధప్రాంతాలు నుంచి వచ్చిన వారు 150 అర్జీలు కలెక్టర్‌కు అందజేసి తమ సమస్యలను వివరించారు. తన పరిధిలో వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కారమార్గం చూపారు. మిగిలినవి సత్వరమే పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికకు అధికారులు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రతిరోజు డ్యాస్‌బోర్డును పరిశీలించాలన్నారు. ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. నమోదైన అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అర్జీలు పునరావృతం అయితే అధికారులు సక్రమంగా పనిచేయటం లేదని భావించాల్సి ఉంటుందన్నారు. గడువు తీరిన అర్జీలు చీరాల ఆర్డీవో పరిధిలో నాలుగు ఉండటంపై ఆరా తీశారు. 21 రెవెన్యూధర ఖాస్తుల గడువు తీరినప్పటికి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. స్వర్ణాంధ్ర 2047కు సంబంధించిన విజన్ బాపట్ల, నూతన ఆవిష్కరణ, ప్రణాళిక రూపొందించటం కోసం మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో, మంత్రులు, ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే అవగాహన కార్యక్రమం, సదస్సుకు అధికారులు గంట ముందుగా హాజరుకావాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రైతుల నుంచి నీటితీరువా పన్నులు వసూళ్ళు చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. రెవెన్యూ అంశాలపై నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లరూరల్, అక్టోబరు 07 : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామపరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్‌కు సంబంధించి పంచాయతీ తరుపున ఎటువంటి అనుమతులు తీసుకోకుండా క్రయ, విక్రయాలు జరుపుతున్నారంటూ వారిపై చర్యలు తీసుకోవాలంటూ భర్తీపూడి గ్రామసర్పంచ్ అచంట అమరేష్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

పేదలపక్షపాతిగా చెరగని ముద్ర వేసుకున్న శంకరన్


శంకరన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు 07 : పేదలపక్షపాతిగా పనిచేసిన ఎస్.ఆర్.శంకరన్ ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు. ఎస్.ఆర్.శంకరన్ 14వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ ఆవరణంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలిసి ఆయన విగ్రహానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నిజాయితీగా పనిచేసి ఎంచుకున్న లక్ష్యాలను చేరుకున్న గొప్ప వ్యక్తి ఎస్.ఆర్.శంకరన్‌అని కొనియాడారు. ఐటిడిఏ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల రూపకల్పన చేసిన మేధావిగా ఆయనను అభివర్ణించారు. త్యాగనిరతితో పనిచేసిన శంకరన్‌కు అరుదైన గౌరవం దక్కిందన్నారు. ఆయన అడుగుజాడలలో ప్రభుత్వ ఉద్యోగాలు నడవాలని సూచించారు. పద్మభూషన్ అవార్డును ప్రభుత్వం ప్రకటించినప్పటికి సున్నితంగా తిరస్కరించిన పేదపక్షపాతిని అంటూ తన ఔన్నత్యాన్ని ఆయన చాటుకున్నారని వివరించారు. పేదప్రజలకు పనిచేయటం కొరకు పునరంకితం కావాలని సూచించారన్నారు. ఫోరంఫర్‌బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తృత్వ పోటీలలో విజేతలైన ప్రీతిశ్రీ, కావ్యలకు కలెక్టర్ చేతులమీదగా బహుమతులు అందజేశారు. వరదల సమయంలో విశేషంగా సేవలందించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను సంస్థప్రతినిధులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, ఉపకలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కొల్లూరు, అక్టోబరు 7 : వరద బాధితులకు విద్యా సంస్థలు అందించిన నిత్యావసర సరుకులను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పంపిణీ చేశారు. సోమవారం మండల పరిధిలోని పోతార్లంక గ్రామంలో జీఎస్‌ఆర్ విద్యా సంస్థలు సహకారంతో సీపీఎం ఆధ్వర్యంలో రూ.2లక్షలు విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు బాధితులకు అందజేశారు.

భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ ఫిర్యాదు

బాపట్లరూరల్, అక్టోబరు 07 : వేటపాలెం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన పిట్టు కావ్యశ్రీ అనే మహిళ అధిక కట్నం కోసం తన భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం ఎదుట మహిళా విలేకర్లతో మాట్లాడుతూ 2024 ఆగస్టు 23వ తేదిన వేటపాలెం మండలం కొత్తపేట గ్రామంకు చెందిన పిట్టు నాగబాబు అనే వ్యక్తితో తనకు వివాహం అయిందని తెలిపారు. వివాహమైన 16 రోజుల వరకు భర్త, అత్తమామలు బాగా చూసుకున్నారని తర్వాత అత్త పిట్టు శివపార్వతి, పిట్టు శ్రీనివాసరావులు పుట్టింటికెళ్ళి ఇంకా కట్నం తీసుకురావాలంటూ నన్ను మానసికంగా వేధించటంతోపాటు నాభర్త తన అమ్మానాన్నల మాటలు విని కొట్టాడని తెలిపారు. అదనపు కట్నం కోసం తనను ఎందుకు హింసిస్తున్నారంటూ నా తండ్రి అడిగితే ఆయనపై ఆయనపై దాడికిపాల్పడ్డారని తెలిపింది. నన్ను వదిలించుకొని వేరే వివాహం చేసుకుంటామని బెదిరించిన నా భర్త పిట్టు శివనాగబాబు, అత్త పిట్టు శివపార్వతి, మామ పిట్టు శ్రీనివాసరావు, నాభర్త చిన నాయనమ్మ, పిట్టు లీలాపై చీరాల టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోలేదని, తనకు న్యాయం చేయాలంటూ అడిషనల్ ఎస్పీకు వినతిపత్రాన్ని అందజేశారు.

డిగ్రీ చదివిన వారంతా ఓటరుగా చేరాలి


సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల,అక్టోబరు 07 : బాపట్ల నియోజకవర్గంలో డిగ్రీ పూర్తి చేసిన వారంతా ఓటరుగా చేరి కూటమి ప్రభుత్వం బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం టీడీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ గతంలో ఓటు వేసిన వారితోపాటు కొత్తగా డిగ్రీ పూర్తి అయిన వారితో సహా అందరు మళ్లీ ఓటరుగా నమోదు కావాల్సి ఉంటుందన్నారు. ఓటర్లను సమయాత్తం చేసి ఎన్‌రోల్ చేయటానికి బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం తెలుగుదేశంపార్టీ కార్యాలయాలలో శిభిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నవంబరు 6వ తేదీ వరకు ఓటరుగా చేరే అవకాశం ఉన్నందున బాపట్ల అంబేద్కర్ సర్కిల్ కూడా ప్రత్యేక శిభిరం పెట్టి ఓటరు నమోదు చేయటం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లోకూడా ఓటరు నమోదు చేసుకునేవిధానం గురించి పార్టీశ్రేణులంతా అవగాహన కల్పిస్తారన్నారు. ఈనెల 11వ తేది మధ్యాహ్నం జనరల్ బాడి మీటింగ్ ఏర్పాటు చేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందరితో మాట్లాడటం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరు ఓటరుగా చేరాలని ఎమ్మెల్యే కోరారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం పలికిన కలెక్టర్, అధికారులు


రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మొక్క అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, అక్టోబరు 07 : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం బాపట్ల మండలం పాండురంగాపురంగ్రామ సముద్రతీరంలోని గోల్డెన్ రిసార్ట్స్‌లో బస చేశారు. ఆయనను కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అభినందనలు తెలియజేశారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా బాపట్ల వచ్చిన గవర్నర్‌కు జిల్లా పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వర్ణాంధ్ర 2047పై నేడు సమీక్ష

హాజరుకానున్న ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు

బాపట్ల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు సంబంధించిన సమీక్ష కలెక్టరేట్ వేదికగా మంగళవారం జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ సహా ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో చర్చించడంతో పాటు వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని తదనుగుణంగా ప్రణాళికలు రచించనున్నారు. యువతకు ఉపాధితో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి అవలంభించాల్సిన విధానాలు సమావేశంలో చర్చకు రానున్నాయి. దీనితో పాటు మారుతున్న సాంకేతికతతో ప్రపంచంతో పోటీపడే విధంగా మనకున్న వనరులను ఏ విధంగా సద్వినియోగం చేసుకోగలమో విజన్ 2047లో చర్చించనున్నారు. అదే విధంగా రాబోయే 23సంవత్సరాలకు అభివృద్ధి ప్రణాళికలకు తోడు స్వల్ప కాల వ్యవధిలో ఫలితాలు చూపెట్టే విధంగా కూడా సమీక్షలో సమగ్రంగా కసరత్తు చేయనున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలి


శిశు మరణాలపై వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న డాక్టర్ విజయమ్మ

బాపట్ల, అక్టోబరు 07 : గర్భిణీలు పోషకాహారం తీసుకునేవిధగా అవగాహన కల్పించాలని అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గర్భిణీలకు అందించే పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ వైద్యసిబ్బందికి సూచించారు. డీఎమ్ అండ్ హెచ్‌వో కార్యాలయంలో సోమవారం వైద్య సిబ్బందికి శిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో విజయమ్మ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ 12 వారాల్లోపు తప్పక నమోదు చేయాలని, హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారు మొదటి నుంచే మంచి ఆహారం తీసుకునేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. కాన్పు అయిన తర్వాత బిడ్డ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ వ్యాధి నిరోధకటీకాలపై అవగాహన కల్పించాలని ఎఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లను ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ శేషకుమార్, డీపీఎమ్‌వో రోహిణి రత్నశ్రీ, డాక్టర్ భూషణ్, పి.హెచ్.సి వైద్యసిబ్బంది, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా సహకార వ్యవస్థ


బాపట్ల బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఆంజనేయులు, రాఘవేంద్రరావు

బాపట్ల, అక్టోబరు 07 : పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా సహకార వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతో ది.విశాఖ పట్టణం కోఆపరేటివ్ బ్యాంక్‌ను స్థాపించినట్లు వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు స్పష్టం చేశారు. బాపట్ల పట్టణంలోని మహాత్మాగాంధీ రోడ్డులో 54వ బ్రాంచ్‌గా ఏర్పాటు చేసిన బ్యాంక్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, చైర్మన్ చలసాని రాఘవేంద్రరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పురావాలని అన్నారు. 2025 మార్చి నాటికి తమ బ్యాంక్ 8వేల కోట్ల లక్ష్యంగా డిపాజిట్‌లు సేకరణ ఉంటుందన్నారు. బ్యాంక్ లక్ష్యం పరస్పర సహకారమన్నారు. ఉద్యోగులు, సభ్యులు కలిసి ఉంటేనే సహకార వ్యవస్థ బలోపేతంగా ఉంటుందన్నారు. కార్యక్రమానికి చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అధ్యక్షత వహించగా ఎం.వెంకటరత్నం, రంగరాజు, దుర్గాప్రసాదరావు, శ్యామసన్, బి.శ్రీనివాసరావు, ఏలూరి గురవయ్య, వాణి సుజాత, జి.వెంకటేశ్వరరావు, గోగినేని సుబ్బారావు, ఎం.రాఘవరావు, నామన కామరాజు, జనార్ధనరావు,ఆదినారాయణశాస్త్రి, వెంకటరమణ, ప్రసాదరావు, సత్యనారాయణమూర్తి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, రామకృష్ణారావు, వరలక్ష్మి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలి


డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రమాదేవి

భట్టిప్రోలు, (కొల్లూరు) అక్టోబరు 7 : వరదల్లో సరస్వం కోల్పోయి ఉపాధి కరువైన డ్వాక్రా మహిళల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి, సీపీఎం కార్యవర్గ సభ్యులు డి.రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలతో సామూహిక రాయభార కార్యక్రమం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కృష్ణానది వరదల కారణంగా మండలంలోని మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీలు సరస్వం కోల్పోవడంతో పాటు పలు ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. వరదల వల్ల లంక గ్రామాల్లో మూడు నెలల పాటు వ్యవసాయ పనులు లేనందున రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసి డ్వాక్రా మహిళలను ఆదుకోవాలన్నారు. మహిళలు దాచుకున్న పొదుపు డబ్బులను తక్షణమే ఆయా గ్రూపులకు ఇప్పించాలన్నారు. రుణాల కోసం బ్యాంకు, డ్వాక్రా అధికారులు ఒత్తిడి చేస్తే ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటామయ్య, చేనేత సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, పి.మనోజ్‌కుమార్, దీపాల సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు, పెసర్లంక, పెదలంక, చింతమోటు, ఓలేరుపల్లెపాలెం గ్రామాల డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

భట్టిప్రోలు, (కొల్లూరు) అక్టోబరు 7 : వర్షాలకు ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణలు డిమాండ్ చేశారు. సోమవారం చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పడుతున్న ఇబ్బందులపై తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల చేనేత మగ్గాల గుంట్లోకి నీరు చేరి కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. 20రోజులకు పైగా పనులు లేకపోవడంతో రోజు గడవక అనేక కష్టాలను ఎదుర్కోవడంతో పాటు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లాలను ముంపు జిల్లాగా ప్రకటించి చేనేత కార్మికులను ఆదుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నేత కార్మికులకు నిత్యావసర సరుకులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, కొడాలి రామకోటేశ్వరరావు, దీపాల సాంబశివరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న మద్యం దరఖాస్తులు

సోమవారం భారీగా అందజేత.. 156 దుకాణాలకు 523 రాక

ఒంగోలు(క్రైం), అక్టోబరు 7 : మద్యం దరఖాస్తులు సోమవారం నాటికి ఊపందుకున్నాయి. మొత్తం 171 దుకాణాలు ఉండగా అందులో 156 షాపులకు 523 దరఖాస్తులు వచ్చాయి. ఇంకా 15 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె.ఖాజా మొహిద్దీన్ తెలిపారు. దరఖాస్తుకు ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉందని పేర్కొన్నారు. భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోని ఆయా సర్కిల్ కార్యాలయాల వద్ద నేరుగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఈనెల 9 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని చెప్పారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

ఎస్ఎన్‌పాడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 7 : సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజే సుధాకర్‌బాబు గుండ్లకమ్మ కాలువలను అక్రమించి షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించడం వల్ల సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని నాగులుప్పలపాడు మండలం మద్దిరాలముప్పాళ్ళ గ్రామానికి చెందిన జెట్టి చెన్నకేశవ ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఫిర్యాదు అందించారు. మల్లవరం గ్రామ 69,238,239 సర్వే నెంబర్లలో సుధాకర్‌బాబు సంస్థ ద్వారా భూములు కొనుగోలు చేసి షాపింగ్‌కాంప్లెక్స్‌తో పాటు పెద్ద బంగ్లాలను నిర్మాణం చేశారని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. దాని వల్ల కాలువలో నీటి ప్రవాహం తగ్గి రైతులకు ఇబ్బందులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలు ఉన్నసమయంలోనే ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. సుధాకర్ భార్య గుండ్లకమ్మ ప్రాజెక్టులో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఒంగోలులో విధులు నిర్వహిస్తున్నారని, అందువల్ల అధికారులు ఎవరూ అక్రమణలు తొలగించేందుకు ముందుకు రాలేదని తెలిపారు. అక్రమనిర్మాణాలపై సర్వే చేయించి వాటిని తొలగించాలని, తద్వారా రైతులకు సాగు నీరు సక్రమంగా అందే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా విచారణ చేయాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు.

డీఎంహెచ్‌వోగా డాక్టర్ రత్నావళి

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 7 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) అధికారిణిగా డాక్టర్ పి. రత్నావళిని నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి మూడు నెలల క్రితం రిటైర్డ్ కావడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ సురేష్‌కుమార్ పనిచేస్తున్నారు. ప్రస్తుతం రత్నావళి విజయవాడ కార్పొరేషన్‌లో చీఫ్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. దసరా పండుగ తర్వాత ఆమె బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కాగా రత్నావళి 2022లో ఒంగోలులో ఎంహెచ్‌వోగా పనిచేశారు. ఆ సమయంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. మరో వైపు లోకాయుక్తాలో కూడా ఆమెపై ఫిర్యాదులు చేయడంతో అప్పట్లో ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇప్పుడు మళ్లీ ఆమెనే డీఎంహెచ్‌వోగా నియమించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు డ్వాక్రా మహిళలు విరాళం

మేదరమెట్ల, అక్టోబరు 7: మండలంలోని కుర్రావానిపాలెంకు చెందిన డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.80వేల చెక్కును రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. సోమవారం మంత్రి రవికుమార్ క్యాంప్ కార్యాలయం వద్ద గ్రామ టీడీపీ నాయకులు నాదెండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు చెక్కును రవికుమార్‌కు అందించారు. ఇటీవల వరదలతో నష్టపోయిన రాష్ట్ర ప్రజలకు అండగా సాయం అందించాలని వారు కోరారు.

ప్రమాదవశాత్తు బాలుడి మృతి


శ్యాంజీవన్ మృతదేహం

చినగంజాం, అక్టోబరు 7 : ప్రమాదవశాత్తు ఆటో ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. ఈఘటన మండలంలోని రాజుబంగారపాలెంలో రామాలయం వద్ద సోమవా రం చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జిల్లా బాలయ్యపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన నవురు వెంకటేష్ 10సంవత్సరాలుగా స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్నారు. వెంకటేష్‌కు భార్య సుజాతకు రెండు నెలల కిందట చిన్నపాటి గొడవలు జరిగి భార్య పుట్టింటికి వెళ్లింది. కుమారుడు శ్యాంజీవన్ (7), కుమార్తె వెంకటేష్ దగ్గరే ఉంటున్నారు. రాజబంగారపాలెంకు చెందిన ఆటోడ్రైవర్ అట్ల మురళీరెడ్డి, వెంకటేష్ స్నేహితుడు. వెంకటేష్ కుమారుడు శ్యాంజీవన్ సోమవారం మురళీరెడ్డి వాళ్ల పిల్లలతో ఆడుకునేందుకు వెళ్లగా తిరిగి శ్యాంజీవన్‌ను వాళ్ల ఇంటి దగ్గర వదిలిపెట్టేందుకు మురళీరెడ్డి తన ఆటోను స్టార్ట్‌చేసి ఉంచి ఇంట్లోకి వెళ్లి వచ్చేలోగా ఆటోలో ఉన్న శ్యాంజీవన్ చేతులు గేర్‌కు తగలడంతో ఆటో ఎదురుగా ఉన్న భవనం గోడను ఢీకొట్టింది. ఆటో కదులుతుందని భయపడి దిగేందుకు ప్రయత్నించిన శ్యాంజీవన్‌కు గోడ బలంగా తగలడంతో ముక్కు, నోటి నుంచి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే 108లో చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు శ్యాంజీవన్‌ను పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. శ్యాంజీవన్ రెండవ తరగతి చదువుతున్నాడు. ఎస్ఐ పరిశీలించి, వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వసూళ్ల పంచాయితీపై విచారణ

ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో కదలిక

ఇన్‌చార్జి డీపీవోతోపాటు మిగిలిన ఉద్యోగుల వద్ద వివరణ తీసుకున్న విచారణాధికారి

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 7 : గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-5, 6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల అక్రమాలపై విచారణ జరిగింది. ఆంధ్రజ్యోతిలో గత రెండు రోజుల నుంచి వస్తున్న కథనాలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. కౌన్సెలింగ్ నాటి నుంచి ఉద్యోగుల ఆర్డర్లు ఇచ్చేంత వరకు జరిగిన పరిణామాలపై ఆరా తీసినట్లు తెలిసింది. ఉద్యోగుల నుంచి భారీగా వసూళ్లపై ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) లోకేశ్వరరావును విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో సోమవారం సాయంత్రం జిల్లా పంచాయతీ కార్యాలయంలో అక్రమ వసూళ్లపై విచారణ చేశారు. ఇన్‌చార్జి డీపీవో ఉషారాణితోపాటు బదిలీపై వెళ్లిన ఏఓ శివప్రసాద్, సంబంధిత సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ కిషోర్‌తోపాటు డిప్యుటేషన్‌పై బయటకు వెళ్లిన సాయిని విచారించారు. ఉద్యోగుల బదిలీలపై వివరణ రాసి ఇవ్వాలని విచారణాధికారి కోరినట్లు సమాచారం. అందుకు సంబంధించి సంబంధిత అధికారులు, ఉద్యోగులు వారి వివరణను విచారణాధికారికి అందజేశారు. గ్రేడ్-5, 6 ఉద్యోగులను ఏ ప్రాతిపదికన బదిలీ చేశారని ఆరా తీసినట్లు సమాచారం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే బదిలీలు చేపట్టినట్లు డీపీవో ఉషారాణి విచారణాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. విచారణ నేపథ్యంలో పరిస్థితులు ఏలా ఉంటాయోనని సంబంధిత ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

భూమి ఆన్‌లైన్ కోసం డీపీవో ఉద్యోగి లంచం

కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని చేయని తాళ్లూరు రెవెన్యూ అధికారులు

ఏడు నెలలుగా పరిష్కారం కాని సమస్య తహసీల్దార్‌కు విన్నపం

తాళ్లూరు, అక్టోబరు 7 : జిల్లా కార్యాలయ ఉద్యోగికి సైతం రెవెన్యూ శాఖలో ముడుపులు సమర్పించుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అడిగినంత ఇచ్చినా నెలల తరబడి సమస్య పరిష్కారం కాలేదు. తప్పని పరిస్థితిలో సోమవారం జరిగిన మీకోసం (గ్రీవెన్‌సెల్)లో తహసీల్దార్ నాగలక్ష్మికి తమ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు ఓ ఉద్యోగి. వివరాల్లోకెళ్తే... జిల్లా పంచాయతీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గాదంశెట్టి ప్రభాకర్‌కు తాళ్లూరు మండలంలోని సోమవరప్పాడు పరిధిలోని సర్వే నంబర్ 228లో ఎకరా 50 సెంట్ల భూమి ఉంది. ఆ పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని సచివాలయంలో అన్ని వివరాలతో జనవరి నెలలో దరఖాస్తు పెట్టారు. పరిశీలన కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. తరచూ సెలవుపెట్టి తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయానికి రావడానికి ఇబ్బందిగా ఉండటంతో, అక్కడ పనిచేసే ఉద్యోగికి రూ.10వేలు ముట్టజెప్పాడు. ఆన్‌లైన్ పని పూర్తిచేయిస్తానని ముడుపులు తీసుకున్న ఉద్యోగి ఏడు నెలలు దాటినా పని చేయించలేదు. ఈక్రమంలో తహసీల్దార్ కార్యాలయంలో పలువురు అధికారులు, ఉద్యోగులు బదిలీలపై వెళ్లారు. విసిగి వేశారిన ప్రభాకర్ సోమవారం తహసీల్దార్ నాగలక్ష్మిని గ్రీవెన్స్ సెల్ తన సమస్యను విన్నవించారు. దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు చేపడతానని తహసీల్దార్ పేర్కొన్నారు.

చెరువులన్నీ బీళ్లు..


మట్టి అక్రమ రవాణాతో కనిగిరి పెద్ద చెరువులో ఏర్పడ్డ అగాధాలు

- కనిగిరి నియోజకవర్గంలో అధ్వానస్థితిలో సాగునీటి చెరువులు
- రెండు దశాబ్దాల క్రితం నిండా నీటితో రైతులకు పంటే
- క్రమంగా ఆక్రమణలకు గురై కుచించుకుపోయిన వైనం
- కనీస మరమ్మతులు లేక అడవులను తలపిస్తున్న దైన్యం
- నిధులు మంజూరైనా ఒక్కపైసా ఇవ్వని గత ప్రభుత్వం
- దిక్కుతోచక తలలు పట్టుకుంటున్న అన్నదాతలు

ఒకప్పుడు అన్నదాతలకు కాసుల పంట కురిపించిన చెరువులు నేడు ఆక్రమణల చెరలో చిక్కుకుపోయాయి. రెండు దశాబ్దాల క్రితం వరకూ నిండా నీటితో కళకళలాడుతూ గ్రామాలను సస్యశ్యామలంగా ఉంచిన చెరువులు నేడు చుక్కనీరు లేక చిల్లచెట్లతో నిండిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఏ చెరువు చూసినా ఏమున్నది గర్వకారణమన్నట్టు వరుస కరువులతో బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. ఎండిపోయిన కట్టలు, తొలగిపోయిన తూములు... గండ్లు పడ్డ అలుగులతో విధ్వంసాలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. కాంట్రాక్టర్లకు పైసా కూడా విదల్చకపోవడంతో ట్రిపుల్‌ఆర్ (రిపేర్, రెనోవేషన్ అండ్ స్టోరేషన్) పనులన్నీ పడకేశాయి. ఒకవైపు ఆక్రమణలు పెరిగిపోవడం, మరోవైపు మరమ్మతులు లేకపోవడంతో చెరువులన్నీ నోళ్లుతెరచి వెక్కిరిస్తున్నాయి. వాటిని చూసి ఏం చేయాలో దిక్కుతోచని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

- కనిగిరి, ఆంధ్రజ్యోతి

వైసీపీ పాలనలో నిధుల విడుదల శూన్యం

గత ప్రభుత్వంలో కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, హెచ్ఎంపాడు, సీఎస్‌పురం, పీసీపల్లి, వెలిగండ్ల మండలాల్లోని 42 చెరువుల మరమ్మతులకు ట్రిపుల్ ఆర్ (రిపేర్, రెనోవేషన్ అండ్ రీస్టోరేషన్) పనుల కింద రూ.25.78 కోట్లు మంజూరయ్యాయి. 10 మందికిపైగా కాంట్రాక్టులు దక్కించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులను కేవలం కాగితాలకే పరిమితం చేసింది. ఒక్కపైసా కూడా విడుదల చేయలేదు. అయినా కాంట్రాక్టర్లు కొంతమేర పనులు చేశారు. దాదాపు రూ.15 కోట్ల పనులు జరిగాయి. వాటిలో ఇప్పటికే 25 శాతం పూర్తయ్యాయి. 60 శాతం పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 15 శాతం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైసీపీ పాలనలో నిధులు విడుదల చేయకపోవటంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఫలితంగా పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

ఏయే పనులకు ఎంతెంత మంజూరంటే..

- కనిగిరి మండలంలోని 11 చెరువులకు, పునుగోడు, గొల్లపల్లి రిజర్వాయర్ మరమ్మత్తులకు, నీటి సంరక్షణ పనులకు రూ.12.39 లక్షలు మంజూరయ్యాయి.
- హెచ్ఎంపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, నందనవనం చెరువులకు రూ.70 లక్షలు, సీఎస్ పురం మండలంలోని 11 చెరువులకు రూ.3.10 కోట్లు మంజూరయ్యాయి. వాటిలో కోవిలంపాడు చెరవుకే రూ.49.5 లక్షలు మంజూరైంది.
- పీసీపల్లి మండలంలో 8 చెరువులకు రూ.3.14 కోట్లు, వెలిగండ్ల మండలానికి 7 చెరువులకు, పందువ గండి రిజర్వాయర్‌కు రూ.6.44 కోట్లు మంజూరయ్యాయి.

ఆక్రమణల చెరలో చెరువులు

కనిగిరి నియోజకవర్గంలో భారీ, చిన్ననీటి పారుదల చెరువులు 136 ఉన్నాయి. వాటిలో పంచాయతీ రాజ్ చెరువులు 80, చిన్ననీటిపారుదల చెరువులు 56 ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా చెరువుల పరిస్థితి దయనీయంగా ఉంది.

- కనిగిరిలోని ప్రధాన చెరువులైన రెండూ ఆక్రమణకు గురయ్యాయి. చెరువు వాగు, అలుగు స్థలాల్లో వెంచర్లు వెలిశాయి. కొండవాగులు, వంకలు, కాలువలు ఆక్రమణలకు గురై చుక్కనీరు కూడా చెరువులకు పారడం లేదు. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటి వాడుక నీటికి కూడా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.
- 280 ఎకరాల కనిగిరి పెద్దచెరువు, 100 ఎకరాల నాగులచెరువుల్లో చుక్కనీరు కూడా లేదు.

మండలాల వారీగా చెరువుల దుస్థితిదీ..

- కనిగిరి మండలంలోని జమ్మలమడక, చీర్లదిన్నె, బల్లిపల్లి, తాళ్లూరు, ఉస్తుంవారిపల్లి, కలగట్ల, బొటికర్లపాడు చెరువులతో పాటు 2500 ఎకరాలు ఆయకట్టున్న గొల్లపల్లి రిజర్వాయర్ అలుగు, సప్లై చానల్ పాడైపోయాయి. వరదలొస్తే అలుగుకు గండి పడే ప్రమాదముంది. 2000 ఎకరాల ఆయకట్టున్న పునుగోడు రిజర్వాయర్‌కు అరకొర పనులు చేసి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారు. కనిగిరి, తాళ్లూరు కొటాలపల్లి, గుడిపాడు, కనిగిరి చెరువులు మరమ్మతులకు గురయ్యాయి.
- సీఎస్‌పురం మండలంలో పెదరాజుపాలెం, కోవిలంపాడు, డీజీపేట, అంబవరం, వీబైలు, సీయస్ పురం, పెదగోగులపల్లి, రేగులచెలక చెరువులు అధ్వానంగా మారాయి. 800 ఎకరాలు ఆయకట్టున్న సీఎస్.పురం చెరువు డొక్కలవాగు కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. డీజీపేట చెరువు పరిస్థితీ ఇంతే.
- వెలిగండ్ల మండలం పందువగండి రిజర్వాయర్ ఆయకట్టు 1200 ఎకరాలు కాగా చెరువు తూములు, కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 300 ఎకరాలు ఆయకట్టున్న కొటాలపల్లి చెరువు రాళ్లకట్టలు జారిపోయాయి. వెదుళ్లచెరువు, ఇమ్మడిచెరువు, కంకణంపాడు, నాగిరెడ్డిపల్లి చెరువులు ఎండిపోయి కట్టలు ధ్వంసమయ్యాయి.
- హనుంతునిపాడు మండలంలోని 194 ఎకరాల ఆయకట్టు ఉన్న నందనవనం చెరువు, 300 ఎకరాల ఆయకట్టున్న తిమ్మారెడ్డిపల్లి చెరువు పంట కాలువలు, వాగులు శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నాయి. 170 ఎకరాల ఆయకట్టున్న వాలిచెర్ల చెరువు, రామాయిపల్లి, వీరరామాపురం, చిన్నముప్పళ్లపాడు, చెరువుల అలనాపాలనాలేక... నీరు చేరక రూపురేఖలే మారిపోయాయి. హాజీపురం చెరువు ఆక్రమణకు గురై కుచించుకుపోయింది.
- 480 ఎకరాల ఆయకట్టు ఉన్న పీసీపల్లి చెరువు ఎండిపోయి అడవిని తలపిస్తోంది. 350 ఎకరాల ఆయకట్టున్న పామూరు పాత చెరువు తొట్టి ఆక్రమణలకు గురై కాలువలు, తూములు ధ్వంసమయ్యాయి. మాకేరు, పాలేరు వాగులన్నీ ఎండిపోయి ఇసుక వ్యాపారుల అక్రమార్జనగా మారాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఐదేళ్లలో నియోజకవర్గంలోని అన్ని చెరువులు పూర్తిగా ఎండిపోయి చిట్టడవులుగా మారాయి.


చెరువులో విపరీతంగా ఉన్న చిల్లచెట్లు


పిచ్చితుమ్మ చెట్లతో నిండిపోయిన పీసీపల్లి పెద్దచెరువు


వెలిగండ్లలోని ఇమ్మడిచెరువుకు గత ప్రభుత్వంలో కరకట్ట పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రతి అర్జీని పరిష్కరించేలా అధికారులు పనిచేయాలి

పట్టణాభివృద్ధి, వసతుల కల్పనపై శ్రద్ధ తీసుకోవాలి

ఇసుక రవాణాలో చెడ్డ పేరు తెస్తే సహించేది లేదు

విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 7 : ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజావేదికలో భాగంగా సోమవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో మంత్రి రవికుమార్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మం త్రి రవికుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మ నది నుంచి ఇసుక రవాణా విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నారు. అద్దంకి పట్టణానికి గుండ్లకమ్మ నది నుంచి ట్రాక్టర్ ఇసుకను రూ.2500 లోపుగానే అందించాలన్నారు. ఊటబావులు, ఎత్తిపోతల పథకాలు, బ్రిడ్జిల వద్ద ఇసుక తవ్వకాలు జరిగితే అధికారులు తక్షణమే స్పందించి కఠినంగా వ్యవహరించాలన్నారు. స్థానిక అవసరాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తే మాత్రం ఉపేక్షించవద్దని అధికారులకు తెలిపారు. పట్టణంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీటి సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలన్నారు. పట్టణ సమగ్ర మంచినీటి పథకానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.85కోట్లు మంజూరై పనులు ప్రారంభించినా ఇంకా పూర్తి కాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో అంతర్గత పైప్ లైన్‌ల నిర్మాణ సమయంలో సీసీ రోడ్లను పగులగొట్టి వదిలివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సీసీ రోడ్లు నిర్మాణం చేయాలన్నారు. 3 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయని, ఎస్ఎస్సీ కాలనీ, దామావారిపాలెం, టిడ్కో ఇళ్ల వద్ద ఏర్పాటు చేసేందుకు స్థలాల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు పైకప్పుపై సోలార్ ప్లాంట్ ఏర్పాటును పరిశీలించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

మంత్రి డాక్టర్ స్వామి

నాలుగు నెలల్లో జిల్లాకు రూ.140 కోట్లు మంజూరు

కొండపి నియోజకవర్గానికి రూ.17కోట్లు కేటాయింపు

సింగరాయకొండ ఎంపీడీవో కార్యాలయంలో 'మీకోసం'కు హాజరై అర్జీల స్వీకరణ

దీపావళికి ఉచిత సిలిండర్లు ఇస్తామని ఉద్ఘాటన


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

సింగరాయకొండ, అక్టోబరు 7 : సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే జిల్లాలో అభివృద్ధి పనులకు రూ.140 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. కొండపి నియోజకవర్గంలో రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి రూ.17 కోట్లు కేటాయించామన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం 91 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిలో అత్యధికం రెవెన్యూ సమస్యలు ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మండలంలోని ఈనాం భూముల సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దీపావళి నుంచి సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తామని మంత్రి స్వామి చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో కె.ప్రసన్నలక్ష్మి, తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ పరిశీలన

జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న కనుమళ్ల ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట బ్లాక్ స్పాట్‌లను మంత్రి స్వామి పరిశీలించారు. ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల నేషనల్ హైవే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకుంటే హైవేపై ప్రజలతో కలిసి ధర్నా చేస్తానని హెచ్చరించారు. గుంతలమయమైన సింగరాయకొండలోని ట్రంకు రోడ్డును మంత్రి స్వామి పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో పొట్టిశ్రీరాములు బొమ్మ ఎదురు రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నాయకులు, కార్యకర్తలతో సమావేశం

మీకోసం కార్యక్రమం ముగిసిన తర్వాత స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మంత్రి డాక్టర్ స్వామి సమావేశమయ్యారు. గ్రామాల వారీగా నాయకులతో మాట్లాడారు. సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రతి నెలలో ఒక రోజు స్థానిక పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు.

అక్రమాలపై కదలిక

డీపీవో, పూర్వ ఏవో, జూనియర్ అసిస్టెంట్లపై ఆరోపణ

కలెక్టర్ ఆదేశాలతో ఎస్డీసీ విచారణ

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 7 : జిల్లా పంచాయతీ కార్యాలయంలో అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. ఉద్యోగుల బదిలీల్లో లక్షలు చేతులు మారుతున్నాయని రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి పెండ్యాల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావును విచారణాధికారిగా నియమించడంతో సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఆయన విచారణ చేపట్టారు. ఫిర్యాదు మేరకు జిల్లా ఇన్‌చార్జి డీపీవో ఉషారాణి, పూర్వ ఏవో శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ కిషోర్, క్యాంపు క్లర్క్ సాయిలు కలిసి ఈ బదిలీల్లో లక్షల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, వీరందరు ఒక బృందంగా ఏర్పడి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లింది. ఏవోగా పనిచేసిన శివప్రసాద్ ఆరు సార్లు సస్పెండ్ కావడంతోపాటు గత 20 ఏళ్లుగా ఒంగోలులోనే జూనియర్ అసిస్టెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్ కిషోర్ బాపట్ల జిల్లాకు బదిలీ అయినా తన పలుకుబడితో ఒంగోలులోనే ఉద్యోగం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వాటన్నింటిపై విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారైన లోకేశ్వరరావు ముందుగా ఇన్‌చార్జి డీపీవో ఉషారాణిని విచారణ చేసినట్లు సమాచారం. తదనంతరం సంబంధిత ఉద్యోగులను కూడా విచారించి పలు అంశాలను రాబట్టినట్లు తెలిసింది. మరోవైపు ఫిర్యాదు చేసిన వెంకటేశ్వర్లును కూడా విచారణకు పిలుపు ఇవ్వడంతో ఆయన కూడా వచ్చి అందుకు సంబంధించిన పలు ఆధారాలను విచారణాధికారికి అందజేసినట్లు సమాచారం.

గుమ్మడి భలే రాబడి

» పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
» రోజూ పదుల సంఖ్యలో తరలుతున్న వాహనాలు
» హైదరాబాద్ మార్కెట్‌లో టన్ను రూ.10వేలు పలుకుతున్న వైనం
» పండుగవేళ కాయలకు గిరాకీ
» బల్లికురవ మండలంలో ఎక్కువగా సాగు చేసిన రైతులు


ఎగుమతి కోసం ట్రాక్టర్లలో సిద్ధంగా ఉన్న గుమ్మడి కాయలు

బల్లికురవ, అక్టోబరు 7 : మంచి గుమ్మడికి డిమాండ్ ఏర్పడింది. తక్కువ పెట్టుబడితో రైతులు సాగు చేసిన మంచి గుమ్మడికి స్థానికంగా ధరలు తగ్గడంతో రైతులు గుమ్మడి కాయలను డిమాండ్ ఉన్న హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఎకరానికి రూ.15000 పెట్టుబడి పెట్టగా రూ.50వేల లాభం మిగులుతుందని రైతులు చెప్తున్నారు. అక్కడ డిమాండ్ ఉండడంతో ప్రతి రోజు వాహనాలను ఏర్పాటు చేసుకొని గుమ్మడి కాయలను తీసుకు పోతున్నామని తెలిపారు. బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, కొమ్మినేనివారిపాలెం, ఎస్ఎల్ గుడిపాడు, రామంజనేయపురం, వేమవరం, మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు, కొణిదెన, గంగపాలెం, కొప్పెరపాలెం, సోమవరప్పాడు గ్రామాలలో రైతులు సుమారు 50 ఎకరాల్లో మంచి గుమ్మడి కాయల తోటలను సాగు చేశారు. రైతులు సాగు చేసిన మంచి గుమ్మడి కాయల దిగుబడులు గతవారం రోజుల నుంచి పెద్దఎత్తున వస్తున్నాయి. దీంతో మన ప్రాంతంలో ఉన్న మార్టూరు, గుంటూరు మార్కెట్లలో టన్ను గుమ్మడి కాయలు రూ.5 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఇలా అయితే తమ పంటకు లాభాలు రావని గ్రహించి పొరుగు రాష్ట్రం అయిన తెలంగాణలోని హైదరాబాద్ మార్కెట్‌కు వాహనాలను ఏర్పాటు చేసి ఎగుమతి చేస్తున్నారు. అక్కడ టన్ను గుమ్మడి కాయలు రూ.10వేల ధర పలుకుతుందని తెలిపారు. ఇక దసరా పండగకు పట్టణాల్లో గుమ్మడి కాయలను అందరు వాడతారని అందుకే గుమ్మడి కాయలకు ఇప్పుడు హైదరాబాద్‌లో విపరీతమైన డిమాండ్ ఉందని, పండగ తరువాత ధరలు తగ్గే అవకాశాలు ఉండడంతో రైతులు ప్రతి రోజూ 20 వాహనాల్లో గుమ్మడి కాయలను అమ్మకాలకు తరలిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎకరాకు రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెప్తున్నారు. గత రెండు మసాల కిందట టన్ను గుమ్మడి కాయలు రూ.20 వేల వరకు పలికాయని రైతులు ఎక్కువ మెత్తంలో పంట సాగు చేయడంతో ధరలు ఇప్పుడు తగ్గాయని రైతులు తెలిపారు. మన రాష్ట్రంలోని ఎర్రగుమ్మడి కాయలు పొరుగు రాష్ట్రానికి తరలించే పనిలో రైతులు ఇప్పుడు బిజీబిజీగా కన్పిస్తున్నారు.


గుమ్మడి కాయలను లోడ్ చేస్తున్న రైతులు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ షాలెంరాజు

450 మందికి కంటి పరీక్షలు

అద్దంకిటౌన్, అక్టోబరు 7: అద్దంకి బంగ్లారోడ్డులోని ప్రేమ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ హస్పిటల్ 2వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం డాక్టర్ జి.షాలెంరాజు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 450 మంది హాజరు కాగా వారికి పరీక్షలు నిర్వహించారు. 200 ఉచిత మందులను అందించారు. మరో 55 మందికి కంటి శస్త్ర చికిత్సకు గుర్తించారు.

డివైడర్ దిమ్మెను ఢీకొట్టిన ఆటో

మేదరమెట్ల, అక్టోబరు 7 : జాతీయ రహదారిలో పి.గుడిపాడు వద్ద ఎమర్జెన్సీ రన్‌వేలో సిమెంట్ దిమ్మెను ట్రాలీ ఆటో ఢీకొట్టింది. దీంతో సిమెంట్ దిమ్మె రోడ్డు మధ్యకు జరిగింది. అటు నుంచి వస్తున్న మోటార్ సైకిలిస్టులకు దిమ్మె కనిపించకపోవడంతో ఢీకొట్టి గాయపడ్డారు. ఆదివారం ఏలూరు నుంచి నెల్లూరు వెళ్తున్న ట్రాలీ ఆటో రన్‌వేపై వెళ్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులో డివైడర్‌పై సిమెంట్ దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో సిమెంట్ దిమ్మె ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్లే దారిలోకి వచ్చింది. ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న మురికిపూడి మంజు, రమేష్ దిమ్మెను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. కైకలూరు మండలం శ్రుంగవరపు గ్రామానికి చెంద వ్యక్తి ఆటో డ్రైవర్ జయమంగళ పరమగీత రాజుకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్సులో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు.


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించండి

ఎస్ఐ శివకుమార్

రామాపురం(చీరాలటౌన్), అక్టోబరు 7 : ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం రామాపురం, వాడరేవు ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి వాహనాలు నడుపుతున్న వారికి ఎస్ఐ హెచ్చరించారు. అనంతరం సముద్రతీరంలో లోతట్టు ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఈవోఆర్డీగా సుమంత్

పంగులూరు, అక్టోబరు 7 : ఈవోఆర్డీగా కె.సుమంత్ విధుల్లో చేరారు. మండలంలో ఈవోఆర్డీ పోస్టు దీర్ఘకాలంగా ఖాళీగా ఉంది. వలేటివారిపాలెం ఈవోఆర్డీగా పనిచేస్తున్న సుమంత్ పంగులూరు మండలానికి బదిలీపై వచ్చారు.

పంచాయతీ కార్యదర్శిగా సుబ్బారెడ్డి

ఇంకొల్లు, అక్టోబరు 7 : పంచాయతీ కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి సోమవారం బాధ్యలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కోటినాగయ్య బదిలీ కాగా, వాడరేవులో పనిచేస్తున్న సుబ్బారెడ్డిని ఇంకొల్లు కార్యదర్శిగా నియమితులయ్యారు.

పీఆర్ జేఈగా ఆనంద్

పంచాయతీ రాజ్ జేఈగా ఆనంద్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శాస్త్రి బదిలీపై వెళ్లగా ఆనంద్ ఇంకొల్లు పంచాయతీరాజ్ జేఈగా నియమితులయ్యారు.

ఈవోఆర్డీగా రాజ్యలక్ష్మి

ఈవోఆర్డీగా రాజ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావు వేటపాలెం బదిలీ అయ్యారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

మార్టూరు, అక్టోబరు 7 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని కోరుతూ సోమవారం మార్టూరు సెంటర్లో ప్రజా సంఘాలు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన ర్యాలీని నిర్వహించారు. గన్నవరం రోడ్ నుంచి ప్రారంభించిన ర్యాలీ నాగరాజుపల్లి సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా పెద్ద అండరుపాస్ వద్ద పలువురు నాయకులు మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి జోక్యం చేసుకోవాలని, యుద్ధాన్ని ఆపాలని, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, జీహెచ్ మజుందార్, బత్తుల హనుమంతరావు, వీరవల్లి కృష్ణమూర్తి, పాలెపు సాంబయ్య, గఫూర్ పాల్గొన్నారు.

వరలక్ష్మి జ్ఞాపకార్థం పాఠశాలకు వితరణ

ఇంకొల్లు, అక్టోబరు 7 : ఇంకొల్లులో 1979లో శాంతినికేతన్ స్కూల్‌ను స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు బంగారుబాటలు వేసిన ఉపాధ్యాయురాలు ఆవులమంద వరలక్ష్మి అని పలువురు కొనియాడారు. సోమవారం వర్ధంతి సందర్భంగా సభ నిర్వహించి, అన్నదానం ఏర్పాటు చేశారు. ఆమె జ్ఞాపకార్థం మండల పరిషత్ పాఠశాలకు రూ.లక్ష విలువైన ఉయ్యాలు, జారుడుబల్ల, రంగులరాట్నం, ఆట వస్తువులను బహూకరించారు. కార్యక్రమంలో వరలక్ష్మి భర్త సుబ్బయ్య మాస్టార్, కుమారులు పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యవసాయ కూలీ మృతి


సుందరరావు మృతదేహం

చీరాలటౌన్, అక్టోబరు 7 : వ్యవసాయ కూలీ పాముకాటుకు మృతిచెందిన సంఘటన సోమవారం చీరాల సమీపంలోని రొంపేరు కాలువ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం పూండ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన గాలి సుందరరావు(50) వ్యవసాయ కూలీ. సోమవారం గ్రామస్థులతో కలిసి నారు పీకుడుకు చీరాల సమీపంలోని రొంపేరు వద్ద పొలాలకు వెళ్లారు. పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యారు. దీంతో బంధవులు హుటాహుటీన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించే అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అతనికి భార్య బుల్లిమ్మ, వివాహమైన కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి యువకుడి బలవన్మరణం

మృతిపై పలు అనుమానాలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 7 : రైలు కిందపడి యువకుడు బలవన్మరణం చెందాడు. ఈఘటన ఆదివారం రాత్రి ఈపూరుపాలెం పరిధిలోని సావరపాలెం రైలు గేటు సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పేరాల జక్కావారి వీధికి చెందిన తూదోటి వెంకటరావు ఈపూరుపాలెంకు చెందిన లక్ష్మి దంపతులకు ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు గోపీ(23) ఉన్నారు. గతకొంత కాలం కిందట వెంకటరావు మరణించడంతో లక్ష్మి సంతానంతో ఈపూరుపాలెంలోని స్వగ్రామంలో నివాసముంటూ వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తుంది. కుమారుడు 10వ తరగతి పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. అయితే పేరాల్లో ఉన్న సంబంధాల కారణంగా అక్కడ అధిక సంఖ్యలో మిత్రులు గోపీతో మిత్రులుగా ఉంటున్నారు. ఈక్రమంలోనే ఆదివారం రాత్రి వరకు కలిసే ఉన్నారు. అక్కడ ఏమి జరిగిందో తెలియదు గానీ తెల్లవారేసరికి గోపీ సావరపాలెం రైలు గేట సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. మిత్రులతో గొడవ జరిగినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

హుండీని పగలకొట్టి నగదు అపహరణ

ఇంకొల్లు, అక్టోబరు 7 : ఇదుపులపాడు చెరువుకట్ట ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉండీలో నగదును గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. హుండీని పగులగొట్టి నగదును అపహరించారని గ్రామానికి చెందిన గోరంట్ల సురేష్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దీనిపై ఏఎస్సై ముస్తాఫా కేసు నమోదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని సీసీ పుటేజీలో హుండీని పగులగొడుతున్న దృశ్యం నమోదై ఉంది.


సీసీ పుటేజీకి చిక్కిన హుండీని పగులగొడుతున్న వ్యక్తి

వైభవంగా దుర్గాదేవికి పూజలు

వాసవీమాతకు మంత్రి గొట్టిపాటి పూజలు



అద్దంకిలో అన్నపూర్ణగా వాసవీమాత, మేదరమెట్లలో గాయత్రీమాతగా

అద్దంకి, అక్టోబరు 7 : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం పలు దేవాలయాలలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం ఉదయం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రవికుమార్‌ను పూజారులు ఆశీర్వదించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు పూటుకూరు రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. దత్త పాదుకా క్షేత్రంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శింగరకొండలోని గాయత్రి పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు.

మేదరమెట్ల : దసర నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మండలంలోని పలు ఆలయాలల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం దైవాలరావూరులోని శ్రీ హనుమత్ సాయి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఉమామహేశ్వరిమ్మమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో పూజలందుకున్నారు. మేదరమెట్లలోని మిద్దెల డొంకలో శ్రీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు మహాచండీ దేవిగా దర్శనమిచ్చారు. రావినూతల, పమిడిపాడు, ప్రాసంగులపాడు, కొరిశపాడు గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలను సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పర్చూరు : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ శ్రీరాం వెంకటసుబ్బారావు నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని దుర్గా దేవిగా అలంకరించగా భక్తులు పూజలు నిర్వహించారు.

ఇంకొల్లు : కృష్ణమందిరంలో సోమవారం అమ్మవారు మహాచండీగా దర్శనమిచ్చారు.





అద్దంకిలో అన్నపూర్ణగా, నాగరాజుపల్లెలో లక్ష్మీదేవిగా, పర్చూరులో దుర్గాదేవి అలంకరణలో పూజలందుకున్న అమ్మవార్లు


పోస్టుమాస్టర్ రేష్మకు చెక్కును అందిస్తున్న వెంకటసుబ్బారావు

మహిళలు పొదుపులో ముందుండాలి

» 100 మంది పిల్లలకు సుకన్య పథకానికి రూ.25వేల చెల్లింపు
» విరాళం అందజేసిన పట్టభద్రుల సంఘం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 7 : మహిళలు పొదుపులో ముందుండాలని, బాలికలు సుకన్య సంవృద్ధి యోజన పథకాన్ని వినియోగించుకోవాలిన పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు సూచించారు. సోమవారం సుకన్య పథకంపై సబ్ పోస్ట్‌మాస్టర్ రేష్మ అవగాహన కల్పించారు. ఈ క్రమంలో సదరు 100 మందికి ఖాతాలు తెరిచేందుకు ప్రారంభ మొత్తం రూ.250 చొప్పున, మొత్తం రూ.25వేల చెక్కును పట్టభద్రుల సంఘం తరపున విరాళంగా అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు సబ్ పోస్ట్‌మాస్టర్ రేష్మకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రావి మస్తాన్‌రెడ్డి, చుండూరు మురళీకృష్ణ, హరిప్రసాద్, శ్రీను, పోస్ట్‌మేన్ రవికుమార్, డాక్ సేవక్ తేజ పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధక కమిటీలు పటిష్టంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, అక్టోబరు 7 : బాల్య వివాహాల నిరోధక కమిటీలు సమర్థవంతంగా పనిచేసి గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల బాల్య వివాహ నిరోధక కమిటీ సమావేశం ఐసీడీఎస్ సీడీపీవో సుధ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో 18ఏళ్లు నిండని ఆడపిల్లలకు వివాహాలు చేస్తే అవి చెల్లవని, ఎవరైనా చేస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలలో ఉన్న మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మండల కమిటీకి తెలియజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, ఎంఈవో వస్త్రంనాయక్ పాల్గొన్నారు.

కొత్త విధానంతో పాలసీదారులు దూరం

లియాపి నాయకుల వినతి


వినతిపత్రాన్ని అందజేస్తున్న లియాపి నాయకులు

అద్దంకిటౌన్, అక్టోబరు 7: బీమా రంగంలో పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టాన్ని చేకూరుస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని లియాపి (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నాయకులు డిమాండ్ చేశారు. కనీస బీమా లక్ష రూపాయల నుంచి రూ.2లక్షలు చేయడంపట్ల చిన్న చిన్న కుటుంబాలు బీమా సౌకర్యాన్ని కోల్పోతాయని నిరసిస్తూ సోమవారం అద్దంకి ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మాధవకృష్ణకు లియాపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వలన చిన్న కుటుంబాలు బీమా సౌకర్యాన్ని కోల్పోవడంతో పాటు ఏజెంట్లకు కూడా తీవ్ర నష్టం జరుగుతుందని లియాపీ బ్రాంచ్ అధ్యక్షుడు వల్లం నాగేశ్వరరావు అన్నారు. ఇలాంటి నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ నెంబర్ చుండూరి నరసింహారావు, మురళీకృష్ణ, త్రిమూర్తులు, వీరాస్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

పర్చూరు, అక్టోబరు 7: రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో సోమవారం పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌ను పంపిణీ చేశారు. అలాగే 10 దర్మామీటర్‌లను రోటరీ అధ్యక్షుడు కృష్ణమోహన్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు నాగబైరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు వార్డు సభ్యులకు శిక్షణ

పంగులూరు, అక్టోబర్ 7 : పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ వార్డు సభ్యులకు మంగళ, బుధవారాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు సభ్యులు (పురుషుడు, మహిళ) హాజరు కావలసిందిగా కోరారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 నిమిషాల వరకు జరుగుతుందని తెలిపారు.


మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మణరావు

జీవనోపాధి మెరుగునకు రుణాలు

పర్చూరు, అక్టోబరు 7 : సమైక్య సంఘాల మహిళల జీవనోపాధిని మెరుగు పర్చాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం రుణాలను అందజేస్తుందని వెలుగు ఏరియా కోర్డినేటర్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం సమైక్య కార్యాలయంలో గ్రామ సంఘ బుక్ కీపర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఏరియా కోఆర్డినేటర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీవనోపాధిని పెంపొందించాలన్న సంకల్పంతో వీఓఏ 5ఏ గ్రేడ్ సంఘానికి రూ.లక్ష నుంచి 5లక్షల రూపాయల వరకు రుణాలను అందజేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. వాటి విధివిధానాలపై అవగాహన కల్పించారు. రుణాలు పొం దిన సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ, సమైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అధ్యాపకులకు మొక్కలను అందజేస్తున్న విద్యార్థులు

సెయింట్ ఆన్స్‌లో ముగిసిన వర్క్‌షాప్

చీరాల, అక్టోబరు 7 : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో మాట్ ల్యాబ్, సిములింక్ అప్లికేషన్స్ ఆన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌పై ఈఈఈ విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ రెండు రోజుల శిక్షణలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగ హెచ్‌వోడీ కిషోర్‌బాబు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీడీ అనిల్‌కుమార్, ఈఈఈ మూడు, నాలుగు సంవత్సరాల విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి మంత్రి గొట్టిపాటి ఆపన్నహస్తం

అద్దంకి, అక్టోబరు 7 : దివ్యాంగురాలికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆపన్న హస్తం అందించారు. అద్దంకి మండలం శింగరకొండ పాలెంకు చెందిన దివ్యాంగురాలు దాచేపల్లి మల్లీశ్వరికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన సొంత నిధులు రూ.1.40లక్షలతో త్రీవీల్ స్కూటీని సమకూర్చి సోమవారం అద్దంకిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద అందజేశారు.


మల్లీశ్వరికి స్కూటీని అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

గుండ్లకమ్మ నదిలో స్నానాల ఘాట్‌లను ఏర్పాటు చేయాలి

గుండ్లకమ్మ నదిలో నాలుగు చోట్ల స్నానాల ఘాట్‌లను ఏర్పాటు చేయాలని పలువురు మహిళా భక్తులు వినతిపత్రం అందజేశారు. కార్తీక మాసంలో స్నానాలు చేసేందుకు వీలుగా ఘాట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. శింగరకొండ వద్ద గిరి ప్రదక్షణకు కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

నివాళులర్పించిన రవికుమార్

పట్టణంలోని ఆర్య వైశ్య నేత గట్టుపల్లి వీరవసంతరావు ఇటీవల మృతి చెందగా మంత్రి రవికుమార్ సోమవారం వీరవసంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు కాకాని అశోక్, కుందారపు రామారావు, లహరి, రామాంజనేయులు, వీరాంజనేయులు, ఆర్యవైశ్య నేతలు అత్తులూరి రమేష్, చిన్ని శ్రీనివాసరావు, గట్టుపల్లి రామారావు, భోజనపల్లి సత్యనారాయణ, చుండూరి మురళీసుధాకర్ పాల్గొన్నారు.